RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 342 మేడ్చల్ మల్కాజ్‌గిరి 2 జనవరి 2025 గురువారం పేజీలు : 4

## రైళ్లలో ఆహారం సరఫరాకు క్లౌడ్ కిచెన్లు

ముంబై : రైళ్లలో అందించే ఆహార నాణ్యతపై తరచూ ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో రైల్వే ప్రయాణికులకు క్లౌడ్ కిచెన్ల ద్వారా ఆహారాన్ని సరఫరా చేయాలని ఐఆర్‌సీటీసీ నిర్ణయించింది. ప్రస్తుతం రైళ్లలో ఆహార సరఫరా కోసం పెద్ద పెద్ద రైల్వే స్టేషన్ల దగ్గర బేస్ కిచెన్లు ఉన్నాయి. వీటిల్లో వేలాది మంది కోసం ఆహారాన్ని వండి, ప్యాకింగ్ చేసి రైళ్లలో అందజేస్తున్నారు. వీటిని ఐఆర్‌సీటీసీ నిర్వహిస్తోంది. అయితే, బేస్ స్టేషన్లలో పరిశుభ్రత పాటించడం లేదన్న ఆరోపణలున్నాయి. దీంతో, ఐఆర్‌సీటీసీ క్లౌడ్ కిచెన్లపై దృష్టి సారించింది. ఇవి ప్రైవేటు ఆపరేటర్ల నియంత్రణలో ఒప్పందం ప్రకారం నడుస్తాయి. సాధారణంగా ఈ ఒప్పందం ఏడేళ్ల పాటు ఉంటుంది. ప్రైవేటు క్యాటరింగ్ సంస్థలు ఆహారాన్ని వండి రైళ్లలో అందజేయాల్సి ఉంటుంది.



## రెండు రాష్ట్రాలు.. ఐదుగురు నేతలు..

# కాలం ఎవ్వరికైనా... సమాధానమిస్తుంది..!

## ముగ్గురికి కలిసొచ్చింది... ఇద్దరికి చుక్కలు చూపించింది!!

హైదరాబాద్ / అమరావతి : పదేళ్ళపాటు కేసీఆర్, ఐదేళ్ళ పాటు జగన్ ఇద్దరూ 'మా మాటే శాసనం' అన్నట్లు ఎదురులేకుండా పాలించారు. కానీ ఇద్దరూ ఇంచుమించు ఒకే సమయంలో రాజకీయంగా దెబ్బ తిన్నారు. మరోపక్క చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, రేవంత్ రెడ్డి ముగ్గురూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఓ రాజకీయ నాయకుడు ఏవిదంగా పోరాట స్ఫూర్తితో పార్టీని ముందుకు నడిపించాలో నిరూపించి చూపారు. ఇప్పుడు పదవీ, అధికారం చేతిలో ఉన్నప్పుడు కూడా ఏవిదంగా వ్యవహరించాలో వారు ముగ్గురూ నిరూపించి చూపుతున్నారు. ఈ ఒక్క విషయంలో తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి ఆలోచనలు, వ్యూహాలు సాధారణ ప్రజానీకానికి కొరుకుడుబడటం లేదు. అందువల్ల విమర్శల పాలవుతున్నారు. బహుశః మరో రెండు మూడేళ్ళలో మంచో చెడో స్పష్టత వస్తుంది. ఈ ఐదుగురు నేతల తీరుని ఓసారి బేరీజు వేసుకొని చూసిననట్లయితే కేసీఆర్, జగన్ ఇద్దరూ మహా మేధావులే అయినప్పటికీ వారి అహంభావం, వారి ద్వేష భావమే వారినీ, వారి పార్టీలను దెబ్బతీసిందని అర్దమవుతుంది. చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి, పవన్ కళ్యాణ్‌ల తీరుని నిశితంగా పరిశీలిస్తే ముగ్గురిలో పాజిటివ్ థింకింగ్, ఎదురుదెబ్బల నుంచి గుణపాఠాలు నేర్చుకునే మంచి లక్షణాలు వారిని నేడు ఈ స్థాయిలో నిలిపిన్నట్లు అర్దమవుతుంది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, చంద్రబాబు నాయుడుపై ద్వేషంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, రాష్ట్రం పట్ల చులకనగా వ్యవహరించేవారు. మాట్లాడేవారు. చివరికి తాను ఏరికోరి ఏపీ ముఖ్యమంత్రిని చేసిన జగన్‌తో కూడా ఆయన సర్దుకుపోలేకపోయారు. కేసీఆర్ అహంభావం, అతిశయం, ద్వేషం కారణంగా రాజకీయాలలో ఒంటరిగా మిగిలిపోయారు. మోడీ పట్ల ద్వేషంతో కేంద్రంతో కయ్యమాడుతూ కేసీఆర్ తెలంగాణ రాష్ట్రానికి కూడా నష్టం కలిగించుకోగా, అప్పులు, అవినీతి, అక్రమాలు, ఆరాచకాలతో జగన్ ఏపీకి తీరని నష్టం కలిగించారు. చంద్రబాబు నాయుడు పట్ల ద్వేషంతో రగిలిపోతూ చివరికి ఆ ద్వేషాగ్నిలో జగన్, వైసీపీ నేతలు కూడా బూడిదైపోయారు. చంద్రబాబు నాయుడుని రాజకీయంగా దెబ్బతీయాలనే దురాలోచన చేసినందునే కేసీఆర్ కూడా రిటర్న్ గిఫ్ట్ తీసుకోవలసి వచ్చిందని అందరికీ తెలుసు. సిఎం చంద్రబాబు నాయుడు ఇప్పటికే ఏపీని గాడిలో పెట్టుకొని మళ్ళీ సానుకూల వాతావరణం సృష్టించారు. అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా డెప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ కూడా పదవీ, అధికారం చేపట్టగానే అహంభావం ప్రదర్శించకుండా, పాలనలో, రాజకీయాలలో తన కంటే చాలా సీనియర్ అయిన చంద్రబాబు నాయుడుతో గౌరవంగా, సఖ్యతగా ఉంటూ కొత్త విషయాలు నేర్చుకుంటూనే తనదైన శైలిలో దూసుకుపోతున్నారు. కూటమి ప్రభుత్వంలో బీజేపి కూడా చాలా ఒద్దికగా ఇమిడిపోయింది. కూటమి ప్రభుత్వం అటు కేంద్రంతో కూడా సఖ్యతగా ఉంటూ ఏపీకి అన్నీ సాధించుకుంటోంది. కానీ ఇప్పుడు ఏపీకి అన్ని విధాలా సానుకూల వాతావరణ ఉన్నప్పటికీ, సిఎం చంద్రబాబు నాయుడు కేసీఆర్, జగన్‌లాగా ఏమాత్రం అహంభావం ప్రదర్శించకుండా అందరినీ కలుపుకుపోతూ ముందుకు సాగుతున్నారు. తెలంగాణతో బంధం బలోపేతం చేసుకోవడానికి రాజకీయా అవరోధాలు ఉన్నప్పటికీ వచ్చిన ఏ అవకాశాన్ని వదులుకోవడం లేదు. తిరుమల శ్రీవారి దర్శనాలకు, ఆర్జిత సేవలకు తమ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇచ్చే సిఫార్సు లేఖలను గౌరవించాలని రేవంత్ రెడ్డి డిసెంబర్ 16న లేఖ వ్రాయగా, సిఎం చంద్రబాబు నాయుడు వెంటనే సానుకూలంగా స్పందిస్తూ 30న జవాబివ్వడమే ఇందుకు చక్కటి తాజా నిదర్శనం. కనుక ఇప్పటికైనా కేసీఆర్, జగన్ ఇద్దరూ అహంభావం, ద్వేషాలు పక్కనపెట్టి చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి, పవన్ కళ్యాణ్‌ల నుంచి ఏమైనా నేర్చుకుంటే వారికీ, వారి పార్టీలకు మంచిది కదా?

## ఏసీబీ కేసు, ఈడీ నోటీసును న్యాయపరంగా ఎదుర్కొంటా: కేటీఆర్

హైదరాబాద్: ఏసీబీ కేసు, ఈడీ నోటీసును న్యాయపరంగా ఎదుర్కొంటామని మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. "ఫార్ములా–ఈ రేసు.. ఏసీబీ పెట్టిన అవినీతి లేని మొదటి కేసు. ఏడాదిగా ప్రయత్నించి నాపై కేసు పెట్టారు. ఫార్ములా–ఈ రేసుకు పురపాలక శాఖ మంత్రిగా నేను అనుమతిస్తే రేవంత్‌రెడ్డి రద్దు చేశారు. నేను తప్పు చేస్తే రేవంత్‌రెడ్డిది ఎలా ఒప్పు అవుతుంది? ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై త్వరలో సుప్రీంకోర్టుకు వెళ్తాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా కాంగ్రెస్ మోసం చేస్తోంది.

రైతు భరోసాతో రైతుల నుంచి తిరుగుబాటు వస్తోంది. కేసీఆర్ మా ట్రంప్ కార్డు.. ప్రజల్లోకి ఎప్పుడు రావాలో ఆయనకు తెలుసు. ఫార్ములా–ఈ కేసులో కోర్టు అడిగే ప్రశ్నలకు ఏజీ దగ్గర సమాధానం లేదు. ఈ ఏడాది ఉపఎన్నికలు రావొచ్చు. ట్రిపుల్ ఆర్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం రూ. 12వేల కోట్లు నష్టం చేస్తోంది. ఖాజాగూడలో ఉన్న భూములపై కన్నేసి పేదలను రోడ్డుపాలు చేశారు. రూ. 1.38 లక్షల కోట్లు అప్పు చేసి దిల్లీకి రూ.వేల కోట్లు పంపుతున్నారు. సంక్రాంతికి దిల్ రాజువి రెండు సినిమాలు ఉన్నాయి.. ఆయన బాధ ఆయనది. ఫిబ్రవరి లేదా మార్చిలో భారాస బహిరంగసభ ఉంటుంది. వేసవికాలం నుంచి పార్టీ సభ్యత్వ నమోదు, అక్టోబరులో పార్టీ అధ్యక్ష ఎన్నిక ఉంటుంది. కేసీఆర్‌ను పార్టీ అధ్యక్షుడిగా మొదట నేనే ప్రతిపాదిస్తా" అని కేటీఆర్ తెలిపారు.




తెలంగాణలో ఇప్పుడు టెంపుల్ టూరిజం విషయంలో సీఎం రేవంత్ రెడ్డి సీరియస్ గా ఉన్నారు. సినిమా వాళ్లు కూడా టెంపుల్ టూరిజం డెవలప్ చేయాలంటూ గురువారం జరిగిన భేటీలో స్పష్టంగా చెప్పారు. దీనికి సినిమా పరిశ్రమ కూడా ప్రచారం చేసేందుకు సిద్ధమైంది. తమ తమ సినిమాల్లో తెలంగాణ దేవాలయాలను ప్రమోట్ చేయడానికి రెడీ అవుతున్నారు. ఇక ఇదే టైంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక అడుగులు వేస్తున్నారు. తెలంగాణలో ప్రముఖ దేవాలయాలు ఉన్న నేపథ్యంలో వాటిని అభివృద్ధి చేసేందుకు అలాగే వాటికి విశిష్ట ప్రచారం కల్పించేందుకు ఒక సలహాదారున్ని కూడా నియమించేందుకు సిద్ధమయ్యారు. ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావును తెలంగాణ ప్రభుత్వం సలహాదారుగా నియమించుకోనుంది. ఆయనకు క్యాబినెట్ హోదా కల్పించి దేవాదాయ శాఖ అభివృద్ధికి%ౌ% ఆయన సహకారం తీసుకోనున్నారు. దీనికి గరికపాటి కూడా ఇప్పటికే సూత్రప్రాయంగా అంగీకారం తెలిపినట్టు సమాచారం. ఆంధ్ర ప్రాంతానికి చెందిన వ్యక్తి అయినా రేవంత్ రెడ్డి ఆయనకున్న సమర్ధతను గుర్తించి సలహాదారుగా నియమించుకోవడానికి సిద్ధమయ్యారు. ఇప్పటికే ఏపీ ప్రభుత్వం చాగంటి కోటేశ్వరరావుకు క్యాబినెట్ హోదా కల్పించింది. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు ఆయన కృషి చేయనున్నారు. ఇప్పటికే ఆయనకు రెండు మూడు బాధ్యతలను అదనంగా కూడా అప్పగించారు. పుస్తకాలను ప్రచురించి వాటిని ఏపీ ప్రభుత్వ స్కూల్స్ తో పాటుగా ప్రవేట్ స్కూల్స్ కు కూడా రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందించనుంది. ఇక గరికపాటి నరసింహారావు కూడా ప్రతిభవంతుడు కావడంతో అలాగే విద్యావేత్త కూడా కావడంతో ఆయన విషయంలో రేవంత్ రెడ్డి చాలా సానుకూలంగా ఉన్నారు. సోషల్ మీడియాలో అలాగే ఎలక్ట్రానిక్ మీడియాలో గరికపాటి నరసింహారావుకి మంచి క్రేజ్ ఉంది. అయితే దీని వెనక మరో కారణం కూడా ఉంది. తెలంగాణలో భారతీయ జనతా పార్టీ బలపడే క్రమంలో దేవాలయాలను కాస్త ఎక్కువగా ఫోకస్ చేసే అవకాశం ఉన్న నేపథ్యంలో వాటిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు రేవంత్ రెడ్డి రెడీ అవుతున్నారు. గతంలో కెసిఆర్ కూడా చాలా దేవాలయాలకు అభివృద్ధికి నిధులు కేటాయించారు. అందుకే ఈ నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. హిందూ ఓటు బ్యాంకు దూరం కాకుండా రేవంత్ రెడ్డి కాస్త జాగ్రత్త పడుతున్నారు. గరికపాటితో పాటుగా మరో కీలక వ్యక్తిని కూడా సలహాదారు గాని నియమించుకునేందుకు రేవంత్ రెడ్డి సిద్ధమయ్యారు. త్వరలోనే దీనికి సంబంధించి అధికారిక ప్రకటన కూడా రానుంది. క్యాబినెట్ లో కూడా ఇప్పటికే దీనిపై ఆమోదం కూడా తెలిపినట్టు తెలుస్తుంది. అయితే గరికపాటి ఫిబ్రవరి నుంచి బాధ్యతలు చేపట్టే అవకాశాలు ఉన్నాయి.

## తెలంగాణ ఎన్నికల్లో...

# టీడీపీ ఎంట్రీ..

## ఆ ముగ్గురిలో మూడేది ఎవరికో..?




హైదరాబాద్ : తెలంగాణలో పట్టు కోసం తెలుగుదేశం పార్టీ ఎప్పటికప్పుడు ప్రయత్నాలు చేస్తూ వస్తోంది. 2018 లో జరిగిన సాధారణ ఎన్నికలలో వైసీపీ లాంటి పార్టీలు అక్కడ పోటీలు చేయకుండా చేతులు ఎత్తేసిన.. తెలుగుదేశం, కాంగ్రెస్‌తో కలిసి పొత్తు పెట్టుకుని పోటీ చేసి అశ్వరావుపేట, సత్తుపల్లి రెండు నియోజకవర్గాలలో విజయం సాధించింది. ఆ తర్వాత తెలంగాణలో జరిగిన ఏ ఎన్నికలలోను తెలుగుదేశం పోటీ చేయలేదు. హుజూర్‌నగర్ ఉప ఎన్నికలలో మాత్రం అతి తక్కువ ఓట్లు తెచ్చుకుంది. అయితే ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో భారీ మెజార్టీతో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ.. త్వరలో తెలంగాణలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తుందని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలతో పాటు.. అన్ని స్థానిక సంస్థల ఎన్నికలలో టీడీపీ పోటీ చేస్తుందని అంటున్నారు. ఈ విషయంలో టీడీపీ అధినేత చంద్రబాబు కూడా గట్టి పట్టుదలతో ఉన్నారట. తెలంగాణలో పార్టీకి నాయకత్వం లేదు గాని.. క్షేత్రస్థాయిలో బలమైన కార్యకర్తలు ఉన్నారు. తెలంగాణలో పార్టీ బలోపేతం కోసం చంద్రబాబు, నారా లోకేష్ కసరతులు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఎప్పటికీ తెలంగాణలో.. తెలుగుదేశం పార్టీకి గ్రేటర్ హైదరా బాద్‌తో పాటు.. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బలమైన పట్టు ఉంది. ఈ రెండు చోట్ల అధ్యక్షులు ఉన్నారు. టీడీపీ అధ్యక్ష పదవి రేసులో.. మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డితో పాటు.. మాజీమంత్రి బాబు మోహన్.. బీసీ కోటాలో పార్టీ సీనియర్ నేత అరవింద్ కుమార్ గౌడ్ ఉన్నారు. టీడీపీ తెలంగాణలో కార్యకర్తలపై మొదలుపెడితే.. బిజెపితో పాటు బీఆర్ఎస్ నుంచి కూడా కొందరు నాయకులు టీడీపీలోకి వెళ్ళవచ్చని ఊహాగానాలు సాగుతున్నాయి, గత అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ పోటీ చేస్తుందని టాక్ వచ్చిన టీడీపీ పోటీ చేస్తే కాంగ్రెస్ విజయ అవకాశాలు దెబ్బతింటాయని.. రేవంత్ రెడ్డి చెప్పడంతోనే చంద్రబాబు ఆగిపోయారని అంటారు. అయితే ఏపీలో అధికారంలోకి రావాలని పట్టుదలతో ఉన్న చంద్రబాబు తన దృష్టి మొత్తం ఏపీ మీదే పెట్టారు. ఇక ఇప్పుడు తెలంగాణలో మళ్లీ పట్టు కోసం చంద్రబాబు ప్రయత్నాలు మొదలుపెట్టి ఎంతో కొంత ఓటు బ్యాంకు చేర్చితే.. అది కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్‌లలో ఎవరికి ప్లస్ అవుతుంది.. ఎవరికి మైనస్ అవుతుంది అన్న చర్చలు కూడా తెరమీదకి వస్తున్నాయి.

# సంపాదకీయం

## కొత్త ఏడాదిలో బంగారం భవిష్యత్తు ఏమిటి?


వాళ్లు వీళ్లు అన్న తేడా లేకుండా ప్రతి ఒక్కరు ఇష్టపడేది.. సొంతం చేసుకోవటానికి తెగ కష్టపడేది ఏమైనా ఉందంటే.. ఆ జాబితాలో బంగారం మొదటి స్థానంలో నిలుస్తుంది. అంతకంతకూ పెరిగిపోతున్న బంగారం ధర 2023లో కొత్త మార్కుకు చేరుకోవటం తెలిసిందే. గడిచిన సంవత్సరాన్ని పక్కన పెడితే..కొత్త ఏడాదిలో ఏం కానుంది? ఎంతమేర పసిడి పరుగు తీయనుందన్నది ఆసక్తికరం. బంగారంలో పెట్టుబడి పెట్టినోళ్లకు 2023 23 శాతం వరకు ప్రతిఫలాన్ని అందించింది. మరి..కొత్త ఏడాదిలో ఎలా ఉండనుంది? పది గ్రాముల బంగారం ధర ఎంతమేరకు చేరనుంది? అన్న అంశాలపై నిపుణులు ఏమంటున్నారు? అన్నది చూస్తే.. కారణాలు ఏమైనా కావొచ్చు.. దూసుకెళ్లటమే తప్పించి.. వెనక్కి తగ్గటమే ఉండని ఆభరణంగా బంగారం నిలుస్తుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో పది గ్రాముల బంగారం కొత్త ఏడాదిలో రూ.85 వేల మార్క్ కు చేరుకుంటుందని చెబుతున్నారు. ఒకవేళ రూ.90 వేలకు చేరుకున్నా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదన్నది నిపుణుల మాట. ప్రస్తుతం దేశీయ మార్కెట్ లో పది గ్రాముల పసిడి ధర రూ.79,350 వద్ద కొనసాగుతోంది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజీలో రూ.76, 600 వద్ద ట్రేడ్ అవుతోంది. 2024లో బంగారం మీద పెట్టుబడి పెట్టిన వారికి భారీ లాభాల్ని మిగిల్చింది. ఒక దశలో పది గ్రాముల బంగారం రూ.82,400 వరకు వెళ్లటం తెలిసిందే. ఇది ఆల్ టైం గరిష్ఠంగా చెప్పాలి. బంగారం మాదిరే వెండి సైతం అనూహ్య వృద్ధిని నమోదు చేసింది. 2024 లో తొలిసారి కిలో వెండి లక్ష రూపాయిల మార్కును దాటింది. అంతర్జాతీయ మార్కెట్ లో 2024 ప్రారంభంలో ఔన్సు బంగారం (31 గ్రాములు) 2062 డాలర్లు ఉండగా.. ఒక దశలో 2790 డాలర్లకు చేరుకుంది. ప్రస్తుతం 2600 డాలర్ల ఎగువన ట్రేడ్ అవుతోంది. నిపుణుల అంచనాల ప్రకారం కొత్త ఏడాదిలోనూ బంగారం మెరుగైన రాబడిని అందిస్తుందని అంచనా వేస్తున్నారు. 2024తో పోలిస్తే.. ఇప్పుడున్న భౌగోళిక అనిశ్చితులు ఇదే రీతిలో కొనసాగితే బంగారం ధర దేశీయంగా రూ.85 వేలకు చేరుకుంటుందని చెబుతున్నారు. అమెరికా ఫెడ్ అనుసరిస్తున్న విధానంతో బంగారం ధరలు పెరిగేందుకు వీలుందని యెబుతున్నారు. రష్యా - ఉక్రెయిన్ మధ్య యుద్ధం.. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా బంగారం ధరలపై ప్రభావాన్ని చూపాయి. ఇలాంటి భౌగోళిక ఉద్రిక్తతల వేళ బంగారం ధరలు 2-3 శాతం మేర పెరగటం మామూలే. మరోవైపు ట్రంప్ రెండోసారి ఎన్నికైన వేళ.. క్రిప్టో కరెన్సీ పరుగులు తీస్తోంది దీనికి తోడు బాండ్ల రాబడులు పెరగటంతో కొందరు మదుపరులు బంగారానికి దూరంగా ఉండే అవకాశం ఉందంటున్నారు. అదే జరిగితే.. బంగారం జోరు అంచనాలకు కాస్త తక్కువగా ఉండొచ్చని చెబుతున్నారు. బంగారంపై దిగుమతి సుంకాన్ని మోదీ సర్కారు 6 శాతం మేర తగ్గించటంతో పది గ్రాముల బంగారం మీద రూ.5 వేల మేర తగ్గింది. అదే సమయంలో బ్రాండెడ్ జ్యూయలరీ మీద పెరిగిన ఆదరణ కారణంగా బంగారం జోరుకు ఢోకా ఉండదన్న మాట వినిపిస్తోంది.

# భక్తులతో కళకళలాడిన ఆలయాలు

**అలియాబాద్ లోని రత్నాలయ శ్రీ వేంకటేశ్వరస్వామిని, శామీర్ పేటలో శ్రీ కట్ట మైసమ్మ అమ్మవారిని పెద్ద ఎత్తున దర్శించుకున్న భక్తులు**







శామీర్ పేట, (గరుడ వార్త) : తూముకుంట మున్సిపాలిటీ షామీర్పేట మూడు చింతలపల్లి మండలాల్లోరి ప్రముఖ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. బుధవారం ఉమ్మడి శామీర్ పేట మండలంలోని వివిధ గ్రామాలలో నూతన సంవత్సరం పురస్కరించుకొని మొదటి రోజు భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు తరలివెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రత్నాలయంలోని శ్రీ వేంకటేశ్వస్వామిని, శామీర్ పేట పెద్ద చెరువు కట్టమైసమ్మ అమ్మవారిని, శామీర్ పేట రేణుక ఎల్లమ్మ, తూంకుంట శ్రీ గాయత్రీ అమ్మవార్లను భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. నూతన సంవత్సర 2025 సందర్భంగా ఉమ్మడి శామీర్ పేట మం డలంలోని వివిధ దేవాలయాలలో అధిక సంఖ్యలో భక్తలు వెళ్ళి అత్యంత భక్తి శ్రద్ధలతో స్వామివార్లను, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలను చేశారు. మండలంలోని అలియాబాద్ చౌరస్తా వద్ద గల రత్నాలయానికి ఉదయం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. రత్నాలయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ వ్యవస్థాపకులు వేంకటేశం అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేశారు.

**కట్ట మైనమ్మ అమ్మవారును దర్శించుకున్న భక్తులు...**

కాగా నూతన సంవత్సరం-2025 సందర్భంగా శామీర్ పేట లోని పెద్ద చెరువు కట్ట మైసమ్మ అమ్మవారును ఉదయం 6 గంటల నుంచి రాత్రి వరకు వేలాది మంది భక్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో దర్శించి ప్రత్యేక పూజలను చేశారు. నూతన సంవత్సరం సెలవు ప్రకటించడంతో కట్టమైసమ్మ ఆలయంలో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ భవాణిరామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రధానర్చకులు గడియారం మురళీధర శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున పూజల్లో పాల్గొన్నారు. అలాగే శామీర్ పేట లోని శ్రీరేణుక ఎల్లమ్మ, తూంకుంట పరిధిలోని శ్రీగాయత్రి మహాక్షేత్రం లోని గాయత్రి అమ్మవారిని భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అలియాబాద్ చౌరస్తా సమీపంలోని శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయం లోని శ్రీస్వామి వారిని, తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్లోని శ్రీ సీత రామచంద్ర స్వామి ఆలయం, అలియాబాద్ లోని శ్రీ సీత రామచంద్రస్వామి ఆలయం, తూంకుంటలోని వేంకటేశ్వర స్వామి ఆలయం, అయ్యప్ప స్వామి ఆలయాల్లో భక్త జనం ప్రత్యేక పూజలు చేశారు. ఉద్దమర్రి శ్రీ విష్ణు శివాలయంలో భక్తులు పెద్ద ఎత్తున స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మడి మండలంలోని వివిధ గ్రామాలలో ఆలయాలకు భక్తులు తరలివెళ్లి పూజలు చేశారు.

# ఐటీఐలకు సాంకేతిక సొబగులు



పెద్దపల్లి : పోటీ ప్రపంచంలో నైపుణ్యం ఉంటేనే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. ఆధునిక సాంకేతికత అందుబాటులోకి వచ్చాక ఆదరణ కోల్పోయిన ఐటీఐలకు పునర్వైభవం తెచ్చే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వాటిని అధునాతన సాంకేతిక కేంద్రాలు(అడ్వాన్స్‌డ్ టెక్నికల్ సెంటర్లు)గా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. ఈ ఏడాది నుంచి కొత్తగా ప్రవేశపెట్టే ఆరు కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. నైపుణ్య లేమితో అవకాశాలు కోల్పోతున్న విద్యార్థులకు ఈ కేంద్రాలు బాసటగా నిలవనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రయోగాత్మకంగా ఎంపిక చేసిన 65 ఐటీఐల్లో పెద్దపల్లి, రామగుండం పారిశ్రామిక శిక్షణ కేంద్రాలకు చోటు దక్కింది.

ఈ ఏడాది నుంచే ప్రవేశాలు

విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపునకు ఆరు ఆధునిక కోర్సులు అందుబాటులోకి తెచ్చారు. మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషిన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్, ఆర్టిసియన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్, బేసిక్ డిజైనర్ అండ్ వెరిఫైర్, అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషనింగ్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికిల్స్ కోర్సుల్లో ఈ ఏడాది నుంచి ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఇప్పటివరకు ఐటీఐలో ఫిట్టర్ ఎలక్ట్రిషియన్, వెల్డర్, మెటార్ మెకానిక్, డీజిల్ మెకానిక్ తదితర కోర్సుల్లో పెద్దగా అవకాశాలు దక్కడం లేదు. దీంతో ఆధునిక సాంకేతిక కోర్సుల్లో విద్యార్థులకు మెరుగైన నైపుణ్యాలు అందనున్నాయి.

కోర్సు ముగియగానే ఉద్యోగంనైపుణ్యాభివృద్ధి కేంద్రాల్లో విద్యార్థులకు మెరుగైన శిక్షణ అందనుంది. ప్రస్తుతం టాటా కంపెనీ ఆరేళ్ల వరకు కోర్సు నిర్వహణ బాధ్యత తీసుకుంది. తర్వాత గడువు పొడిగించనున్నారు. కోర్సు పూర్తి చేసిన వెంటనే అప్రెంటిస్‌షిప్ కల్పిస్తారు. కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు లభించనున్నాయి. ప్రస్తుతం కృత్రిమ మేధ(ఏఐ)కు ఆదరణ కనిపిస్తున్న నేపథ్యంలో ఐటీఐల్లో కొత్త కోర్సులను అందుబాటులోకి తెచ్చారు.

రూ.4.77 కోట్లతో భవనం

అధునాతన సాంకేతిక కేంద్రాల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం టాటా టెక్నాలజీస్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది.

పెద్దపల్లి ఐటీఐ ఆవరణలో రూ.4.77 కోట్లతో నూతన భవన సముదాయాన్ని నిర్మిస్తున్నారు.

ఇప్పటికే కోర్సులకు సరిపడా కొన్ని యంత్రాలు వచ్చాయి. మిగిలినవి కూడా త్వరలో రానున్నాయి.

కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు యంత్రాలను సిద్ధం చేస్తున్నారు.

ఇప్పటివరకు ఐటీఐలు పూర్తి చేసిన విద్యార్థులు కూడా కొత్త కోర్సుల్లో ప్రవేశాలు తీసుకోవచ్చు.

172 సీట్లకు అనుమతి


కొత్తగా ప్రవేశపెట్టిన ఆరు కోర్సులతో విద్యార్థుల్లో మెరుగైన నైపుణ్యాభివృద్ధి సాధ్యమవుతుంది. శిక్షణ పూర్తి చేస్తే కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు దొరుకుతాయి. ఆరు కోర్సుల్లో మొత్తం 172 సీట్లకు అనుమతి ఉంది.వెంకట్‌రెడ్డి, పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్

# ఈ సారైనా 'దిశా'నిర్దేశం చేస్తారా..?

కొత్తగూడెం : కేంద్ర ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాల అమలుపై జిల్లాలో పర్యవేక్షణ కొరవడుతోంది. ఏటా సాధించాల్సిన లక్ష్యాలు నీరుగారుతున్నాయి. ఈ పరిస్థితిని గాడిన పెట్టాల్సిన పాలనా యంత్రాంగం ఒక 'దిశ' లేకుండా ముందుకు సాగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సుమారు పది నెలల విరామం తర్వాత నేడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో 'దిశ' కమిటీ సమావేశమవుతోంది. కనీసం తీర్మానాంశాల అమలుపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు. 2020లో జరిగిన సమావేశంలో సంక్షేమం, అభివృద్ధికి సంబంధించి 72 అంశాలపై తీర్మానం చేశారు. ఆయా లక్ష్యాల సాధనపై పెద్దగా దృష్టిసారించిన దాఖలాల్లేవు. ఆ తర్వాత కరోనా విజృంభణతో రెండేళ్ల పాటు కమిటీ సమావేశమవలేదు. తిరిగి 2022 నవంబరు 26న సమావేశం నిర్వహించారు. అంతకుముందు తీర్మానాలకు సంబంధించి పలు సమస్యలను పరిష్కరించినట్లు అధికారులు శాఖల వారీ లెక్కలు చెప్పినా.. క్షేత్రస్థాయిలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని స్థానిక ప్రజాప్రతినిధులు వాడీ వేడి చర్చకు తెరలేపారు. చివరిసారిగా 2024 జనవరి 25న అప్పటి మహబూబాబాద్ ఎంపీ మాళోత్ కవిత అధ్యక్షతన దిశ కమిటీ సమావేశమైంది. 42 అంశాలపై ప్రగతి నివేదికలను వివిధ శాఖల అధికారులు పొందుపరిచారు. తదనంతరం జరిగిన చర్చలో పలు పథకాల అమలు తీరుపై ప్రజాప్రతినిధులు పెదవి విరిచారు. వారు లేవనెత్తిన సమస్యలపై పెద్దగా స్పందన లేదని విమర్శలు గుప్పించారు. ప్రధానంగా రైల్వే శాఖపై జరిగిన చర్చలో ఇల్లెందులో రైల్వేస్టేషన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపించింది. దీనిపై ఎలాంటి స్పందన లేదు. వైద్యారోగ్య శాఖలో అప్పటి నుంచి ఇప్పటివరకు మందుల కొరత వేధిస్తూనే ఉంది. డయాలసిస్ కేంద్రాలను పెంచాలన్న లక్ష్యంలో కొంత పురోగతి కనిపించినా.. రక్తశుద్ధి సేవలకు కిడ్నీ రోగులు నిరీక్షిస్తూనే ఉన్నారు. మరిన్ని యూనిట్లు పెంచితే తప్ప ఊరట కలిగేలా లేదు. ఏజెన్సీలో వివిధ శాఖల్లో ఉద్యోగాల భర్తీపైనా గతంలో చర్చ లేవనెత్తారు. దివ్యాంగులకు సదరం ధ్రువపత్రాల జారీ ఓ ప్రహసనంగా మారింది. దీనికి సరైన పరిష్కారం చూపాల్సి ఉంది. పీఎం గ్రామీణ సడక్ యోజన, గిరివికాస్ పథకం, మారుమూల గ్రామాలకు త్రీఫేజ్ విద్యుత్తు సౌకర్యం, ఏజెన్సీల్లో సెల్‌టవర్ల ఏర్పాటు ద్వారా నెట్‌వర్క్ విస్తరించాలనే అంశాలపై మరింత దృష్టిసారించాలనే డిమాండ్ ప్రస్తుతం కూడా వినిపిస్తోంది. ముఖ్యంగా విద్య, వైద్య రంగాలను పథకాల అమలుతో పటిష్ఠపరచాలని మన్యం ప్రజలు కోరుతున్నారు.

# ప్రమాదాల లెక్క.. తగ్గించాలి పక్కా

హైదరాబాద్:మెట్రో నగరాలు, జాతీయ రహదారులపై పెరుగుతున్న ప్రమాదాలను తగ్గించాలంటే రహదారి భద్రత గణన (రోడ్‌సేఫ్టీ ఆడిట్) నిర్వహించాలని ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని పట్టణ పర్యావరణ అధ్యయన ప్రాంతీయ కేంద్రం పరిశోధక బృంద సభ్యులు నిర్ధారించారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ముంబయిల్లో ఈ 9 నెలల్లో ప్రమాదాల సంఖ్య పెరిగిందని, వీటిని నియంత్రించపోతే పెరిగే అవకాశాలున్నాయని హెచ్చరించారు. రెండేళ్లలో మెట్రో నగరాలలోని రహదారులు, వాటికి సమీపంలోని జాతీయ రహదారులపై నమోదైన ప్రమాదాలను విశ్లేషించారు. నిర్వహణ లోపాల కారణంగా 40 శాతం జరుగుతున్నాయని గుర్తించారు. రోడ్ సేఫ్టీ ఆడిట్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించి చర్యలు చేపడితే రోడ్డు ప్రమాదాలను 10 నుంచి 20 శాతానికి తగ్గించవచ్చని పట్టణ పర్యావరణ అధ్యయన ప్రాంతీయకేంద్రం సంచాలకులు ప్రొఫెసర్ కుమార్ తెలిపారు. రహదారుల నిర్మాణం... వాహనాల రాకపోకలు: ప్రమాదాలు తగ్గించేందుకు రహదారుల నిర్మాణం, వాహనాల రాకపోకలపై సమగ్ర సమాచారం ఉండాలి. ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ) మార్గదర్శకాలకు అనుగుణంగా వాహనాల రాకపోకల పెరుగుదలను అంచనా వేసి అత్యాధునిక సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని జాతీయ, రాష్ట్ర రహదారుల నిర్మాణంలో వినియోగించాలి. హైదరాబాద్-విజయవాడ, హైదరాబాద్-బెంగళూరు జాతీయ




రహదారుల నిర్మాణ సమయంలో, అందుబాటులోకి వచ్చాక లెక్కలన్నీ మారిపోయాయి. పండగ సెలవులొస్తే చాలు అన్ని టోల్‌గేట్ల వద్ద విపరీతమైన రద్దీ ఉంటోంది. దీంతో రహదారులపై ఒత్తిడి పెరిగి తరచూ ప్రమాదాలు నమోదవుతున్నాయి.

లెక్కల గణనలో అన్ని వివరాలు..

జాతీయ, రాష్ట్ర రహదారులపై చోటుచేసుకుంటున్న ప్రమాదాలపై ఉస్మానియా విశ్వవిద్యాలయం పట్టణ, పర్యావరణ అధ్యయన ప్రాంతీయ కేంద్రం పరిశోధక బృంద సభ్యులు అధ్యయనం చేశారు. నగరంలోని రహదారులు, బాహ్యావలయ రహదారి, హైదరాబాద్-విజయవాడ, హైదరాబాద్-బెంగళూరు రహదారులపై సైన్‌బోర్డులు, రేడియం బోర్డులు కొన్ని ప్రాంతాల్లో లేవని గుర్తించారు. హైదరాబాద్-విజయవాడ రహదారిపై రాత్రివేళల్లో ట్రక్కులు, లారీలను నిలపడంతో వాహనదారులు వాటిని గమనించక ఢీకొడుతున్నారన్నారు.

ప్రయోజనాలు... నియంత్రణ

రహదారి భద్రతను సమీక్షించే ఆడిట్ వ్యవస్థ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వద్ద లేదు. జాతీయ రహదారి నిర్వహణ సంస్థ అధికారులు కొన్ని మార్గాల్లో వీటిని ఏర్పాటు చేయాలి.

ఈ ఆడిట్‌ను పర్యవేక్షించే అధికారులు జాతీయ, రాష్ట్ర రహదారుల మరమ్మతులపై ఎప్పటికప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదికలను సమర్పించేందుకు వీలుంటుంది. నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తే సంబంధిత ఏజెన్సీలపై చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుంది.

ఆడిట్ ద్వారా ఒక రహదారిపై ఎన్ని ప్రమాదాలు జరిగాయి? ఎందుకు జరిగాయి? తెలిస్తే ప్రమాదాలు తగ్గించే వీలుంటుంది.

# అయ్యో రామా.. ఎన్నాళ్లిలా..?

భద్రాచలం : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాధికారులు, ఉద్యోగుల మధ్య అగాధం ఏర్పడుతోంది. అధికారుల నిర్ణయాలు సరిగ్గానే ఉంటాయంటున్నా.. కొన్నిసార్లు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఉద్యోగులు చెబుతున్నారు. ఆంజనేయస్వామి, లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయాలకు సిబ్బంది సరిపడా లేరనే కారణంతో గురువారం కొన్ని గంటల పాటు తాళాలు వేసి ఉంచటం వివాదాస్పదమైంది. సర్దుబాటు చేసే పరిస్థితి ఉన్నా కావాలనే కొందరు ఉద్యోగులు ఈ తతంగం నడిపించారని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈవిషయంపై అదేరోజు సాయంత్రం ఈఓ రమాదేవి తమ ఉద్యోగులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సమావేశ క్రతువును వీడియో తీయించారంటే ఇక్కడ నెలకొన్న అపనమ్మకాలు ఏస్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ధర్మకర్తల మండలి ఏర్పడితే పాలకవర్గ సభ్యులు చొరవ తీసుకునే వీలుంటుంది. ఎలాంటి సమస్య ఉన్నా నేరుగా ప్రభుత్వంతో చర్చించవచ్చుననే వాదనలు వ్యక్తమవుతున్నాయి.

అభివృద్ధిపై అడుగు పడాలంటే..రామాలయ అధికారులు చురుగ్గా వ్యవహరిస్తుండటంతో గతేడాది రూ.80కోట్లు ఉన్న ఆదాయం ఈసారి రూ.100 కోట్లకు చేరుకునే వీలుంది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించటంతో భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రభుత్వం రూ.వందల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కసరత్తు చేస్తోంది. నిర్వాసితులకు పరిహారం చెల్లించేందుకు రూ.60.20కోట్లు కేటాయించింది. రూ.కోటితో కల్యాణమండపం వద్ద శాశ్వత షెడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇలాంటి కీలక సమయంలో వివాదాలు తగవని భక్తులు చెబుతున్నారు. సమన్వయలోపం తలెత్తకుండా ఈఓ, వైదిక బృందం చొరవ చూపాలని కోరుతున్నారు.

కలహాలు తీరేనా..?ఇటీవల ఆలయ ప్రధానార్చకుడు, అతడి కుమారుడు కుటుంబ కలహాలతో రచ్చకెక్కాల్సి వచ్చింది. వీరిద్దరిపై కేసు నమోదు కావటంతో సస్పెండయ్యారు. ఇటీవల ఇద్దరు వైదిక పెద్దలు దసరా ఉత్సవాలకు తిరుపతి వెళ్లి ప్రవచనాలిచ్చారు. సెలవు తీసుకోకుండా ఎలా వెళ్తారని వీరికి ఈఓ మెమోలు జారీ చేశారు.

ఓ అర్చకుడు ఇక్కడ విధులకు హాజరవకుండా వేరే దేశం వెళ్లారు. అతడిని విధుల నుంచి తొలగించారు. క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నా ఆస్థాయిలో పోస్టులను భర్తీ చేయటం లేదు.

ఇక్కడి అవసరాల నిమిత్తం సిబ్బంది సంఖ్య పెంచాలి. 36 మంది వైదిక సిబ్బంది సేవలందించాల్సి ఉంది. పరిచారక పోస్టులను భర్తీ చేయకపోవటంతో తీర్థప్రసాదాల పంపిణీ భారంగా మారుతోంది. ఈతరహా సమస్యలకు మూలాలు తెలిసిన వైదిక పెద్దలు వీటిని పరిష్కరించేందుకు చొరవ చూపటం లేదు. గొడవలు వచ్చినా అంతర్గత ఆలయాలను మూసే పరిస్థితి రాకుండా చూడాలి.

## అసంపూర్తి నిర్మాణాలతో అవస్థలు

భువనగిరి : ప్రభుత్వం మారింది.. మన బడి పథకం అటకెక్కింది.. బిల్లులు మంజూరు చేయకపోవడంతో గుత్తేదారులు పనులు అర్ధంతరంగా నిలిపివేశారు. వెరసి జిల్లా వ్యాప్తంగా ఏడాదిగా పలు నిర్మాణాలు అసంపూర్తిగా మిగిలాయి.. నూతన సర్కారు అమ్మ ఆదర్శ పాఠశాలల పథకాన్ని ప్రారంభించింది. గత పథకంలోని పనులు అసంపూర్తిగా మిగిలిపోగా, కొత్తగా ప్రారంభించిన చిన్న చిన్న పనులు మరికొన్ని నేటికీ పూర్తి కాకపోవడంతో సర్కారు బడుల్లో వసతుల లేమి కొట్టొచ్చినట్టుగా కనిపిస్తుంది.

**చేపట్టిన పనులు ఇలా...**

జిల్లా వ్యాప్తంగా మన ఊరు మన బడి పథకం కింద 251 ప్రభుత్వ పాఠశాలల్లో రూ.50.62 కోట్లతో 870 పనులు ప్రతిపాదించారు. ప్రతిపాదిత పనుల్లో 394 పూర్తి చేయడం గమనార్హం. పలు పాఠశాలల్లో నిర్మాణాలు నిరుపయోగంగా మిగిలాయి. పాఠశాల నిర్వహణను మెరుగుపర్చి, విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చాలన్న లక్ష్యం నెరవేరలేదు. ఒక్క భువనగిరి మండలంలో రూ.7.2 కోట్ల వ్యయంతో 25 పనులు ప్రతిపాదించారు. ఇందులో కేవలం 10 పనులు పూర్తి కావడం గమనార్హం. పనులు చేసిన గుత్తేదారులుకు ప్రభుత్వం సుమారు రూ.2 కోట్లు బాకీ పడింది. బొల్లేపల్లి ఉన్నత పాఠశాలలో ప్రతిపాదించిన పని ప్రారంభించకపో వడం గమనార్హం. అనాజిపురం, పట్టణంలోని



బీచ్‌మహెల్లా ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలలోని డైనింగ్ హాల్స్ అసంపూర్తిగా నిలిచాయి. విద్యార్థులు వరండాలో కూర్చుని మధ్యాహ్న భోజనం చేయాల్సిన దుస్థితి నెలకొంది. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల లో మరుగుదొడ్డి, కిచెన్ షెడ్‌ల నిర్మాణాలు అసంపూర్తిగా వెక్కిరిస్తున్నాయి.

**ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది- సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖాధికారి**

మన ఊరు మన బడి పథకం పనుల విషయమై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. గుత్తేదారులకు బిల్లుల చెల్లింపు నిలిచిపోవడంతో వారు పనులు నిలిపివేశారు. గత గుత్తేదారులతో అగ్రిమెంట్ ఉన్న కారణంగా ఇతరులతో పని పూర్తి చేసే అవకాశం లేదు. బడ్జెట్ మంజూరైన వెంటనే గుత్తేదారులకు బిల్లులు చెల్లిస్తాం. పనులు పూర్తి చేయిస్తాం. అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం కింద 1857 పనులు ప్రతిపాదించి, 1857 పనులు పూర్తి చేశాం. పాఠశాలల్లో సదుపాయాల విషయమై ఇబ్బంది లేదు.

## ప్రతి నీటి చుక్క.. ఒడిసిపట్టేలా

ముదిగొండ : జలమే అన్నింటికి ఆధారం. ప్రాణాధారమైన జలాలను ఒడిసిపట్టుకోకుంటే నీటి కష్టాలు తప్పవు. వేగంగా పడిపోతున్న భూగర్భ జలమట్టాలను పెంచుకోవడం మానవాళికి చాలా అవసరం. ఈ నేపథ్యంలో పరుగులు పెట్టే నీటిని ఆపడంతోపాటు, వర్షపు నీటిని, ఇళ్లలో వినియోగించే నీళ్లను భూమిలోకి ఇంకింపజేసేం దుకు 'జలనిధి' కార్యక్రమం ద్వారా విస్తృత స్థాయిలో పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మిగిలిన నాలుగు నెలల వ్యవధిలో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఇందుకు సంబంధించిన పనులు చేపడుతున్నారు. రాష్ట్ర వ్యాప్త ప్రణాళి కలో భాగంగా ఉభయ జిల్లాల్లో జలనిధి పనులు ప్రారంభమయ్యాయి.

**ఇదీ లక్ష్యం**

భూమికి చేరే ప్రతి చినుకు అమూల్యమైందే. దీన్ని ఒడిసి పడితేనే భూగర్భ జలం పెరుగుతుంది. భూగర్భ జలాలు పెంపొందించడమే జలనిధి లక్ష్యం. అటు పంటపొలాలు, ఇటు ఇంటి అవసరాలు తీరేలా చూడాలన్నదే ఉద్దేశం.

**ఏమేం చేస్తున్నారు?**

జలనిధి కార్యక్రమంలో ఇంకుడు గుంతల నిర్మాణం, ఫారంఫాండ్స్, నీటికుంటల ఏర్పాటు తదితర పనులు చేపడుతున్నారు.ముదిగొండ ఎంపీడీఓ కార్యాలయంలో నిర్మాణంలో ఉన్న ఇంకుడు గుంత



**విస్తృత అవగాహన**

జలనిధిలో ప్రజా భాగస్వామ్యం పెరిగేలా అధికారులు గ్రామాల్లో ప్రజలు, రైతులను చైతన్యపరుస్తున్నారు. ఇళ్లలో ఇంకుడు గుంత నిర్మాణం చేపడితే వ్యర్థ జలాలు రహదారులపైకి రాకుండా ఇంకుడు గుంతల్లోకి చేరి భూగర్భ జలాలు పెరుగుతాయని వివరిస్తున్నారు. రైతులు పొలాల్లో నీటి కుంటలు, ఫారంఫాండ్స్ నిర్మించుకోవాలని సూచిస్తున్నారు.ప్రతి మండలంలో ఇలా..జలనిధిలో భాగంగా ప్రతి మండలంలో నిర్దేశిత పనులు చేపట్టాల్సి ఉంది. ఆ మేరకు అధికారులు కొన్నిచోట్ల పనులు ప్రారంభించారు.ఇళ్లు, ప్రభుత్వ కార్యాలయాల్లోని పైభాగంలో కురిసిన వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకించడం (రూఫ్‌టాప్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్).. ప్రతి మండలంలో 20 యూనిట్ల నిర్మాణాలు చేపట్టాలి.ఎనిమిది రాక్‌ఫీల్డ్ డ్యామ్‌లు, గ్యాబియన్ (రాళ్లతో కట్టకట్టి జాలి), ఎల్‌బీ(లూజ్ బౌల్డర్ స్ట్రక్చర్) నిర్మించాలి.నాలుగు చెక్‌డ్యామ్‌లు, 20 పెర్క్యులేషన్ ట్యాంక్‌లు, 20 ఫారంఫాండ్స్ ఏర్పాటు చేయాలి.ఎనిమిది బోర్‌వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్లు, నాలుగు వ్యవసాయ బావులు నిర్మించాలి.మండలంలో మొత్తంగా 50 ఇంకుడు గుంతలు ఏర్పాటుచేయాలి.జలనిధి పనులు మార్చినాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. నీటిని ఒడిసి పట్టి భూమిలోకి ఇంకింపచేస్తే భూగర్భ జలాలు పెరుగుతాయి. గ్రామాల్లోని ప్రజలు, రైతులకు ఎంపీడీవోల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం.సన్యాసయ్య, డీఆర్‌డీవో

# దృష్టికి వస్తేనే చర్యలు!



మల్యాల : కొండగట్టు అంజన్న ఆలయ భూములు ఎక్కడెక్కడున్నాయో అధికారులకే తెలియని పరిస్థితి నెలకొంది. ఏళ్ల తరబడి కొందరు వ్యక్తులు భూములను సాగు చేసుకుంటున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. కొండగట్టు దిగువ ప్రాంతంలో ఆలయ భూముల్లో భవన నిర్మాణాలు చేపట్టినా చర్యలు తీసుకోవడం లేదన్న ఫిర్యాదులున్నాయి. ముత్యంపేట పరిధిలోని కొండగట్టు అంజన్న పేరిట మల్యాల, కొడిమ్యాల మండలాల పరిధిలో 649 ఎకరాల విలువైన భూములున్నాయి. వాటిలో అత్యధికంగా మల్యాల మండలం లోనే ఉన్నాయి. దాదాపు ఎనిమిదేళ్ల కిందట కొండగట్టు అంజన్న ఆలయ పరిసరాల్లోని గుట్టల ప్రాంతాల్లో 333 ఎకరాల విస్తీర్ణంలోని రెవెన్యూ భూములను అప్పటి కలెక్టరు శరత్ ఆలయ అధికారులకు స్వాధీనం చేశారు. సదరు భూముల వివరాలను రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయించని కారణంగా ఆ భూములు ఎక్కడున్నాయో కూడా తెలియని పరిస్థితి నెలకొన్నట్లు తెలిసింది.

గతంలో పలువురు భూస్వాములు, దాతలు స్వామివారి దూపదీప నైవేద్యం కోసం విలువైన భూములను అందజేశారు. ఆ వివరాలు ఆలయంలోని 43 రిజిస్టరులో నమోదై ఉన్నప్పటికీ ఆ భూములు ఎక్కడున్నాయో తెలియకపోవడంతో వాటిని కొందరు వ్యక్తులు ఏళ్ల తరబడి ఆక్రమించుకొని సేద్యం చేసుకొంటున్నారు. దీనిపై గతంలో కథనం ప్రచురితం కాగా దాదాపు ఏడేళ్ల కిందట అప్పటి ఈవో స్పందించి ఆక్రమణలను గుర్తించి హద్దులు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ అధికారులు కొండగట్టు దిగువ ప్రాంతంలోని ఆలయ భూమిలో ఆక్రమణలపై చర్యలు చేపట్టకపోవడంతో పలు నిర్మాణాలు జరిగాయి. రాంసాగర్ శివారులో ఆలయ భూమి ఆక్రమణకు గురైనట్లు సమాచారం. కొండగట్టు గుట్టల మధ్యగల సంతొల్లలొద్ది చెక్‌డ్యాం కింది ప్రాంతంలోని దాదాపు రూ.1.50 కోట్ల విలువైన 3 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిని(ప్రస్తుతం ఆలయ భూమి) మల్యాల మండల కేంద్రానికి చెందిన ఓ హెటల్ యజమాని ఆక్రమించుకొని దాని చుట్టూ సోలార్ కంచె ఏర్పాటు చేసుకుని 25 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారంటే అధికారుల పర్యవేక్షణ ఏవిధంగా ఉందో అర్థం అవుతుంది. ఇటీవల గిరిప్రదక్షిణ రహదారి నిర్మాణ సమయంలో ఆలయ భూమి ఆక్రమణకు గురైనట్లు అధికారులు గుర్తించారు. గతంలో ముత్యంపేట శివారులోని తుమ్మల చెరువు, పీచుకుంట, మారుతిటౌన్‌షిప్ ముందు ఆలయానికి చెందిన కొన్ని భూములు దాదాపు 40 ఏళ్లుగా ఆక్రమణలో ఉండటంతో వరుస కథనాలు ప్రచురించడంతో అధికారులు స్పందించి హద్దులు ఏర్పాటు చేశారు.

కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం పేర ముత్యంపేట శివారులోని పీచుకుంటలో 211, 212 సర్వే నంబర్లలో 1.35ఎకరాలు, తుమ్మ చెరువు సమీపంలోని 260/ఎఫ్ సర్వే నంబరులో 0.36 ఎకరాలు, కొండపైన 362/2 సర్వే నంబరులో 20ఎకరాలు, 362/3 సర్వే నంబరులో 2ఎకరాలు(ఇందులో ఎకరం భూమిలో కల్యాణమండపం నిర్మాణం కోసం తితిదే ఈవో పేరిట 20ఏళ్ల కిందట రిజిస్టరు చేశారు), కొండగట్టు స్టేజి వద్ద(గుట్ట కింద) 380/బీ సర్వే నంబరులో 0.01ఎకరాలు, 380/సీ సర్వే నంబరులో 1.30ఎకరాలు, 389 సర్వే నంబరులో 2.02 ఎకరాలు, మారుతి టౌన్‌షిప్ సమీపంలోని 410/ఎ సర్వే నంబరులో 2.34ఎకరాలు, కొడిమ్యాల మండలం తిమ్మయపల్లె శివారులోని 98/బీ సర్వే నంబరులో 2.05ఎకరాల మామిడితోట, అదే శివారులో 105/బీ సర్వే నంబరులో 1.17ఎకరాలు, రాంసాగర్ శివారులోని 546సర్వే నంబరులో 8.09ఎకరాలు, నాచుపల్లి శివారులోని 558సర్వే నంబరులో 0.17ఎకరాలు, 562సర్వే నంబరులో 0.14ఎకరాల విలువైన భూములున్నాయి. కొండగట్టు స్టేజి(గుట్ట కింద) అన్యాక్రాంతమైన ఆలయ భూమిని సర్వే చేయించి హద్దులు నిర్ణయించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నా ఆక్రమణదారులు అడ్డంకులు సృష్టిస్తున్నట్లు తెలిపారు. వీటికితోడు రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న భూములు కూడా స్వామివారి పేర ఉన్నట్లు ఆలయవర్గాలు వెల్లడించాయి.

**సర్వే చేయించి హద్దుల ఏర్పాటు** కొండగట్టు గుట్టల మధ్యగల సంతొల్ల లొద్ది చెక్‌డ్యాం కింది ప్రాంతంలోని ఆలయ భూమిని ఓ వ్యక్తి ఆక్రమించుకుని మామిడితోట సాగు చేస్తున్నారు. దాదాపు 3 ఎకరాలకుపైగా ఆలయ భూమిని ఆక్రమించుకుని మామిడిచెట్లు నాటినట్లు గుర్తించాం. ఆలయ భూములను పరిరక్షించేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ఇందు కోసం ప్రత్యేక సర్వే చేపట్టి ఆలయ భూములను గుర్తించి హద్దురాళ్లు కూడా ఏర్పాటు చేయిస్తాం. కొండగట్టు దిగువ ప్రాంతంలోని ఆలయ భూమిలో చేపట్టిన నిర్మాణాన్ని నిలిపివేయించాం. ఆక్రమణదారులపై న్యాయపరమైన చర్యలు కూడా తీసుకుంటున్నాం. రామకృష్ణారావు, కొండగట్టు ఈవో

# అత్యవసరమైనా ఉగ్గబట్టాల్సిందే..!



సూర్యాపేట : పట్టణాలకు వివిధ అవసరాల నిమిత్తం వచ్చేవారు ఒంటికీ రెండింటికీ అవస్థ పడుతున్నారు. ప్రధాన ప్రాంతాల్లో ప్రజా మరుగుదొడ్లు లేకపోవడంతో నరకయాతన అనుభవిస్తున్నారు. మరోవైపు ఉన్నవాటిని సక్రమంగా నిర్వహించక దుర్వాసన వస్తుండగా కొన్నింటిని ఎప్పటికీ తాళం వేసి ఉంచుతున్నారు. దీంతో ఉమ్మడి నల్గొండ జిల్లాలో రూ.లక్షలాది నిధులు నిష్ఫలమవగా జనం ఉగ్గబట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

**నిర్వహణ లేక నిరుపయోగం**

యాదాద్రి జిల్లాలోని పలు పురపాలికల్లో మరుగుదొడ్లను ప్రైవేటు సంస్థలు, మరికొన్నింటిని పురపాలికల ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులు నిర్వహిస్తున్నారు. భువనగిరి పట్టణంలో తొమ్మిదిలో ఐదు పనిచేస్తున్నాయి. రెండేళ్ల క్రితం రూ.50లక్షలతో నిర్మించిన ఐదింటిలో మూడు మూతపడ్డాయి. రోడ్డు విస్తరణలో తొలగించిన వాటిని పునరుద్ధరించడంలేదు. ఆలేరు, చౌటుప్పల్, మోత్కూరు పురపాలికల్లో వినియోగంలో ఉన్నాయి. యాదగిరిగుట్టలో ఒకటి నిర్మాణ దశలో ఉండగా మరొకటి స్థానికుల అభ్యంతరంతో మూతపడింది. భూదాన్ పోచంపల్లిలో ఉన్నఒకటి మూత పడటం గమనార్హం. కోదాడలో 8 నిర్మించగా ప్రధాన రోడ్ల వెంట ఉండటంతో అన్నింటిని వినియోగించుకుంటున్నారు. హుజూర్‌నగర్‌లో నాలుగింటిలో మూడు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. నేరేడుచర్లలో పురపాలక కార్యాలయం ఎదుట ఒకటి నిర్మించగా ఎవరికీ అంతగా ఉపయోగపడటం లేదు. మిర్యాలగూడలో మహిళలకు షీటాయిలెట్ నిర్మించలేదు. నల్గొండలో రామగిరి, కలెక్టరేటు, లతీబ్‌సాహెబ్‌గుట్ల ప్రాంతాల్లో నిర్వహణ మరిచిపోతున్నారు.

బహిరంగ మలమూత్ర విసర్జన రహిత పట్టణాలుగా మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా శౌచాలయాల నిర్మాణాలకు పుష్కలంగా నిధులు మంజూరు చేయడంతోపాటు ప్రోత్సాహకంగా ఏటా రూ.లక్షల నిధులను మంజూరు చేస్తోంది. కానీ అధికారుల నిర్లక్ష్యంతో జిల్లా కేంద్రాలతోపాటు కొన్ని పట్టణాల్లో నిర్వహణ లేమితో అస్తవ్యస్తంగా మారుతున్నాయి. పట్టణ ప్రగతి నిధులతో రెండేళ్ల కిందట ఉమ్మడి జిల్లా పరిధిలోని 18 పురపాలికల్లో 339 మరుగుదొడ్లు నిర్మించారు. అందులో సామూహిక శౌచాలయాల నిర్వహణ (సులభ్ కాంప్లెక్స్)ను ప్రయివేటు వ్యక్తులకు అప్పగించిన చోట మాత్రమే సక్రమంగా ఉన్నాయి. మిగతా ప్రాంతాల్లో చాలావరకు మూతపడ్డాయి.

జన సందడి లేని చోట నిర్మాణం సూర్యాపేట పురపాలికలో 22 ప్రజామరుగుదొడ్లు నిర్మించారు. ప్రధాన సెంటర్లు కాకుండా జన సందడి లేని ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. అంబేడ్కర్‌నగర్‌కు వెళ్లే రోడ్డు, జమ్మిగడ్డ, భీమారం రోడ్డు, ఎన్టీఆర్‌నగర్ ప్రాంతాల్లో నిర్మించారు. వీటిని ఎవరూ వినియోగించుకోవటం లేదు. కొత్త బస్టాండ్ వద్ద శౌచాలయాన్ని ఎక్కువగా వినియోగించుకుంటున్నారు.

## ఈ దుకాణాలు అతివలకు ప్రత్యేకం

సంగారెడ్డి : మహిళలు పొదుపు పాటిస్తూ నిర్వహిస్తూ.. వ్యాపారపరంగా, ఆర్థికపరంగా రాణించేందుకు బాటలు వేసుకుంటున్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ స్థలంలోనే వారికి ప్రత్యేకంగా వ్యాపార దుకాణాల సముదాయాలను నిర్మించి కేటాయిస్తోంది. వచ్చిన ఆదాయాన్ని జిల్లా మహిళ సమాఖ్యకు జమ చేస్తారు. సంగారెడ్డిలోని అల్విన్ బైపాస్ రోడ్డు మార్గంలో వ్యాపార దుకాణాల సముదాయాలను వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ చేతుల మీదుగా త్వరలో ప్రారంభిస్తారు. **రూ.1.74 కోట్లతో నిర్మాణం** సంగారెడ్డి పాత డీఆర్‌డీవో కార్యాలయం ఆవరణలో గత ప్రభుత్వ హయాంలో మహిళ సంఘాల సభ్యులకు ప్రత్యేకంగా వ్యాపార దుకాణాల సముదాయాలకు శంకుస్థాపన చేశారు. 315 చదరపు అడుగుల విస్తీర్ణంలో 16 దుకాణాలకు రూ.1.74 కోట్ల నిధులతో పూర్తి చేశారు. పైన, కింద మొత్తం 16 దుకాణాలున్నాయి. మహిళలకు లాటరీ ద్వారా కేటాయిస్తారు. మహిళ సమాఖ్య సభ్యులై, పట్టణ పేదనిర్మూలన సంస్థలో సభ్యులైన వారు అర్హులవుతారు. రుణాల బకాయిలు లేని వారై ఉండాలి. దరఖాస్తు సొమ్ము రూ.10 వేలు. కేటాయించిన తర్వాత అడ్వాన్స్‌గా ఒక్కో దుకాణానికి రూ.2 లక్షల చొప్పున జిల్లా సమాఖ్య బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. కేటాయింపులో రిజర్వేషన్లు అమలు చేస్తారు.

**నెలకు రూ.3.60 లక్షల ఆదాయం**దుకాణాల ద్వారా నెలకు రూ.3.60 లక్షల ఆదాయం జిల్లా మహిళ సమాఖ్య బ్యాంకు ఖాతాల్లో జమ కానుంది. ఆ సొమ్ముపై వడ్డీలతో సంఘం సిబ్బందికి వేతనాలు ఇవ్వవచ్చు. సంగారెడ్డిలో ప్రయోగాత్మకంగా మహిళలకు ప్రత్యేకంగా పెట్రోల్ బంకును ఇదే ఆవరణలో నిర్మిస్తారు. బంకులో అందరూ మహిళలే ఉండేలా నిర్ణయం తీసుకున్నారు.

## పంచాయతీ పోరుకు మరో అడుగు

సిద్దిపేట: పంచాయతీ ఎన్నికల వైపు వడివడిగా అడుగులు పడుతున్నాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం వేగం పెంచింది. ఇప్పటికే ఓటరు తుది జాబితా వెలువరించడంతోపాటు పోలింగ్ కేంద్రాల కేటాయింపు పూర్తయింది. వివిధ విభాగాల్లో పర్యవేక్షణకు జిల్లాలో నోడల్ అధికారులను నియమించారు. ఈ మేరకు కలెక్టర్ మనుచౌదరి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా బాధ్యతలు అప్పగించారు. జిల్లాస్థాయిలో వివిధ శాఖల అధికారులు నిర్దేశిత విధులు నిర్వర్తించనున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అవసరమైన బ్యాలెట్ పెట్టెలు సిద్ధంగా ఉన్నాయి. జిల్లాలో 12 విభాగాలకు 18 మందిని నోడల్ అధికారులుగానియమించారు.

**23 చోట్ల ఎటూ తేలని వైనం..** గతనెల 30న ఓటర్ల తుది జాబితా



విడుదలైంది. మరోవైపు జిల్లాలో 23 పంచాయతీలకు సంబంధించి ముసాయిదా జాబితా ఇప్పటికీ వెలువడలేదు. దీంతో ఆయా గ్రామాల్లో సందిగ్ధత నెలకొంది. సాంకేతిక కారణాలతో సిద్దిపేట గ్రామీణ మండలంలోని 15 గ్రామాల ఓటర్ల జాబితా ప్రదర్శితం కావడం లేదు. ముంపునకు గురైన 8 గ్రామాల పరిస్థితిపై స్పష్టత కరవైంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఒకింత నిరాశ చెందుతున్నారు. జిల్లా పంచాయతీ అధికారి దేవకిదేవి మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చర్యలు చేపడుతున్నామన్నారు.

పంచాయతీలు: 491 వార్డులు: 4,350 మొత్తం ఓటర్లు: 6,23,813
పురుషులు: 3,06,285 మహిళలు: 3,17,521 ఇతరులు: 07

## వ్యసనం.. మరణశాసనం

సిద్దిపేట : ప్రజలకు అవగాహన కల్పించి.. అండగా నిలవాల్సిన పోలీసులు చిక్కుల్లో పడి ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. ప్రజాచైతన్యంలో ముందు వరుసలో నిలవాల్సిన వారే.. ఆన్‌లైన్ మోసాలు, వివిధ రకాల వ్యసనాల బారినపడి విలవిల్లాడుతున్నారు. ఎంతో కష్టపడి ఓ స్థాయికి చేరిన పోలీసుల్లో కొందరు వారి నేపథ్యాన్ని మరిచి.. తప్పుడు నిర్ణయాలతో కనుమరుగవుతున్నారు. ఆన్‌లైన్ మోసంతో హెడ్‌కానిస్టేబుల్ బండారి బాలకృష్ణ, మహిళతో ఏర్పడిన సాన్నిహిత్యం వల్ల నర్సాపూర్‌కు చెందిన సాయికుమార్ బలవన్మరణానికి పాల్పడిన తీరు ఆయా జిల్లాలో కలకలం రేపింది. గతేడాది డిసెంబరులో ఆన్‌లైన్ గేమ్‌ల బారినపడిన చిన్నకోడూరు మండలం రామునిపట్లకు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ చేసిన అప్పులు తిరిగి చెల్లించే మార్గంలేక భార్య, ఇద్దరు పిల్లలను కాల్చి చంపి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సరిగ్గా ఏడాది వ్యవధిలో మరో విషాదం చోటుచేసుకోవడం చర్చకు దారి తీసింది. మరోవైపు 2016 నుంచి ఇప్పటి వరకు జిల్లా పరిధిలో విధులు నిర్వర్తించిన అయిదుగురు పోలీసులు వివిధ కారణాలతో ఆత్మహత్యకు ఒడిగట్టారు. వారి కుటుంబ సభ్యులతోసహా తొమ్మిది మంది మృతిచెందారు. తాజా ఘటనతో ఆ సంఖ్య 10కి చేరింది. శిక్షణ కాలంలో తెలుసుకున్న అంశాలను విస్మరించి మృత్యుఒడికి చేరుతున్న ఉదంతాలు శాఖ ప్రతిష్ఠను అభాసుపాలు చేస్తున్నాయి. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందనే ప్రాథమిక అంశాన్ని విస్మరిస్తున్నారు. కాస్త ముందుచూపుతో ఆలోచించి.. ఆదర్శ భావాలతో ముందడుగు వేస్తే సమాజానికి మార్గదర్శిగా నిలవొచ్చని పోలీసు అధికారులు చెబుతున్నారు.

**వ్యవసాయ కుటుంబం..**బాలకృష్ణకు తల్లిదండ్రులు మల్లవ్వ-రాజు ఉన్నారు. వీరిది వ్యవసాయ నేపథ్యం కలిగిన మధ్య తరగతి కుటుంబం. ఇంట్లో పెద్దవాడైన బాలకృష్ణ ఉద్యోగ సాధనకు రెండేళ్లపాటు శ్రమించారు. 2012లో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించారు. రెండేళ్ల కిందట హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారు. మరోవైపు సిద్దిపేటలోని కాళ్లకుంట కాలనీలో రెండేళ్ల కింద ఇల్లు కొని కుటుంబంతో కలిసి ఇక్కడే ఉంటున్నారు. అతని భార్య మానస స్వస్థలం దుబ్బాక మండలం రఘోత్తంపల్లి. 13 ఏళ్ల కిందట వారి వివాహమైంది. సొంత జిల్లా సిరిసిల్ల అయినా.. అన్నింటికీ అనువుగా ఉంటుందనే భావన, కుమారుల చదువు దృష్ట్యా సిద్దిపేటలో నివశిస్తున్నారు. అన్యోన్యంగా సాగుతున్న ఆ కుటుంబంలో ఆన్‌లైన్ మోసం కల్లోల్లాన్ని సృష్టించింది.

**లింగన్నపేటలో విషాదం..**స్వగ్రామం గంభీరావుపేట మండలం లింగన్నపేటలో విషాదం నెలకొంది. తల్లిదండ్రులు రాజు, మల్లవ్వ, కుటుంబీకులు శోకసంద్రంలో మునిగిపోయారు. శవపరీక్ష అనంతరం మృతదేహాన్ని స్వగామానికి తీసుకొచ్చారు. బాలకృష్ణ తమ్ముడు గల్ఫ్ నుంచి వస్తున్నాడు. అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.మహిళతో ఏర్పడిన పరిచయం వ్యక్తి ప్రాణాల మీదికి తెచ్చింది. ఆమె కుటుంబ సభ్యులు బెదిరింపులకు దిగడం, డబ్బులు డిమాండ్ చేయడం వంటి సంఘటనలతో కలవరానికి గురైన హెడ్ కానిస్టేబుల్.. పోలీసు శాఖలో పరువుపోతుందని, కుటుంబంలో, చుట్టుపక్కల వారికి తెలిస్తే ముఖం ఎలా చూపేదని తీవ్రంగా కుమిలిపోయాడు. ప్రాణాలు తీసుకున్నాడు. మెదక్ జిల్లా కొల్చారం పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కాటూరి సాయికుమార్(55) తాను పనిచేస్తున్న స్టేషన్‌లోనే ఆదివారం బలవన్మరణానికి పాల్పడిన సంఘటన పోలీసు శాఖను కుదిపేసింది. మూడు రోజుల క్రితం ఇదే గ్రామానికి చెందిన సాయికుమార్ సైతం కామారెడ్డి జిల్లా చెరువులో అనుమానాస్పదంగా మృతి చెందడం తెలిసిందే.

**సాయికుమార్ నేపథ్యమిది...**

సాయికుమార్ 1992లో కానిస్టేబుల్ ఉద్యోగం చేపట్టారు. జోగిపేట, నర్సాపూర్, కౌడిపల్లి, కొల్చారం పోలీస్‌స్టేషన్లలో పనిచేశారు. ఏపీలోని గుంటూరు జిల్లా రేపల్లెకు చెందిన ఆయన ఏళ్ల క్రితం ఇక్కడికి వచ్చి స్థిరపడ్డారు. ఏడాదిన్నర క్రితం కొల్చారానికి బదిలీ కావడంతో నర్సాపూర్ నుంచి నిత్యం వెళ్లివస్తున్నారు. నర్సాపూర్‌లో పనిచేసిన సమయంలో స్థానికంగా టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్న యజమాని దివ్యతో పరిచయం ఏర్పడింది. మూడు రోజుల క్రితం ఫిర్యాదు...

దివ్య భర్త శివకుమార్ మూడు రోజుల క్రితం సాయికుమార్‌పై చర్యలు తీసుకోవాలంటూ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అక్కడి నుంచి నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు కాపీని పంపారు. ఈ మేరకు శివకుమార్‌ను నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌కు పిలిచి సీఐ జాన్‌రెడ్డి విచారించారు. తిరిగి ఫిర్యాదు స్వీకరించారు. అనంతరం హెడ్ కానిస్టేబుల్ సాయికుమార్‌ను పిలిచి మాట్లాడారు. వారితో రాజీ కుదుర్చుకుంటానని. కోరారు. ఆ తర్వాత సాయికుమార్ పలుమార్లు వారితో సంప్రదింపులు జరిపారని తెలిసింది. కొంత మొత్తం ఇవ్వడానికి చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో ప్రాణాలు తీసుకున్నారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. రెండు రోజుల క్రితం నర్సాపూర్ చెరువులో ఆత్మహత్యాయత్నం చేసినట్లు పోలీసుల విచారణలో గుర్తించారు.

# ఎత్తిపోతలే ఆధారం.. తప్పని భారం..!

ధర్మపురి : యాసంగి సాగుకు ఎత్తిపోతల పథకాలపైనే ఆధారపడి రైతులు సాగుకు ఉపక్రమిస్తున్నారు. జిల్లాలోని రోళ్లవాగు ప్రాజెక్టు కింద ధర్మపురి మండలంలో 10 వేల ఎకరాలకు పైగా సాగు నీరందించాల్సి ఉండగా నేటికీ షెట్టర్లను బిగించకపోవడంతో సాగు నీరందించే పరిస్థితి లేకుండా పోయింది. కాలువల ద్వారా నీరురాని దుస్థితి నెలకొంది. ప్రత్యామ్నాయం లేకపోవడంతో గోదావరిన ది నీటి ఆధారంగానే అన్నదాతలు ఎక్కువగా పంటల సాగు చేస్తున్నారు. ధర్మపురి ఎస్సారెస్పీ డివిజన్ పరిధిలోనిఎత్తిపోతల పథకాలు ఉన్నాయి.

**రైతులకు ఇక్కట్లు...**

ఈ ఎత్తిపోతల పథకాలకు మరమ్మతుల నిర్వహణ భారం రైతులపై పడుతోంది. ఒక్కో ఎత్తిపోతల పథకం నిర్వహణకు రూ.లక్షల్లో వ్యయం అవుతోంది. రైతులంతా కలిసికట్టుగా వీటికి మరమ్మతులు చేపడుతున్నారు. యాసంగి పంటకు ఈ ఎత్తిపోతల పథకాలే ఆధారం. సాగు నీరందించే సమయంలో 18 హెచ్‌పీ మోటార్లన్నీ మరమ్మతులకు గురవుతున్నాయి. నిర్వహణ అధ్వానంగా ఉండటంతో రైతు కమిటీల ఆధ్వర్యంలో ఎకరానికి రూ.5 వేల చొప్పున జమ చేసుకుని ఎప్పటికప్పుడు మరమ్మతులు చేసుకుంటున్నారు. ఒక్కో మోటారుకు ఒకసారి మరమ్మతు చేస్తే కనీసం రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు వ్యయం అవుతోంది. ఒక్కో ఎత్తిపోతల పథకానికి కనీసం ఒక రూ.లక్ష వరకు వ్యయం అవుతోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే నిర్వహిస్తే మేలు ఎత్తిపోతల పథకాల నిర్వహణ, మరమ్మతుల బాధ్యతలు ప్రభుత్వానికి అప్పగించాలని అన్నదాతలు కోరుతున్నారు. ప్రతీ సంవత్సరం యాసం గి సీజన్‌లో పంటల సాగుకు నీటికోసం ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు. పంటల సాగుకు అయ్యే ఖర్చుకు తోడు ఎత్తిపోతల నిర్వహణ భారం తమపైనే పడుతోందని అంటున్నారు. ఇప్పటికే ఈ ఎత్తిపోతల పథకాలకు సంబంధించి ఒక ఆపరేటర్, మరొకరు పని చేస్తున్నారు. చెల్లింపులు, ఇతర నిర్వహణ భారం రైతు కమిటీలే భరిస్తున్నాయి. ప్రభుత్వమే నిర్వహణ బాధ్యత చేపట్టాలని అన్నదాతలు కోరుతున్నారు.



# చేపల వేట.. ప్రమాదంతో ఆట

కోదాడ :కోదాడ మండలం మంగలితండాకు చెందిన రామకృష్ణ, కమ్లు, లాలు వేర్వేరు సందర్భాలలో విద్యుత్తు తీగలను ఉపయోగించి చేపల వేటకు వెళ్లి మృత్యువాత పడ్డారు. అయినా తండావాసులు ప్రమాదకరపు వేటను మాత్రం వదిలిపెట్టడం లేదు. గాలానికి విద్యుత్ తీగను అమర్చి వేటకు వెళ్తున్నారు. నాలుగు నెలల క్రితం కోదాడకు చెందిన ఓ యువకుడు పెద్ద చెరువులో వేటకు వెళ్లి మృత్యువాత పడ్డాడు. విద్యుత్ స్తంభం నుంచి తీగలను లాగి గాలం సహాయంతో వేటాడటమే ప్రమాదానికి కారణమని పోలీసులు తెలిపారు. అధికంగా చేపలు పట్టి అమ్ముకోవాలని ఒకరు.. ఇంట్లోకి కూర కోసం మరొకరు.. మద్యం తాగిన మైకంలో ఇంకొకరు.. సందర్భమేదైనా విద్యుత్తును ఉపయోగించి చేపలు పట్టడం చాలా ప్రమాదకరం. కాస్త ఏమరపాటుగా ఉన్నా ప్రాణాలు కోల్పోవాల్సిందే. కళ్లెదుటే ఎన్నో ఘటనలు జరుగుతున్నా కొందరు వ్యక్తులు వాటిని లెక్కచేయకుండా విద్యుత్ అమర్చిన గాలంతో చేపలను వేటాడుతున్నారు. కోదాడ పట్టణంలోని పెద్ద చెరువు నుంచి పాలేరు వాగును కలిపే ఉల్క చెరువులో ఇది నిత్య కృత్యమే. మంగలితండా, నల్లబండగూడెం, అనంతగిరి మండలం కొత్తగూడెంలో ప్రవహిస్తున్న పాలేరు వాగులో ప్రాణాలను పణంగా పెట్టి వేట సాగిస్తున్నారు. సగానికి పైగా వేటగాళ్లు మద్యం మత్తులోనే చేపలు పడుతున్నారు. అధికారులు హెచ్చరిస్తున్నా పెడచెవిన పెడుతున్నారు.

కాలువలు, వాగులు, చెరువుల పక్కనే ఉండే విద్యుత్తు మోటార్లు, స్తంభాల నుంచి తీగలు లాగి చేపలు పట్టే గాలానికి అమర్చుతారు. గాలానికి ఎరను తగిలించి నీళ్లలో వేస్తారు. ఎర తినడానికి వచ్చే చేపకు విద్యుత్ తీగ తాకగానే గాలంలో పడుతుంది. ఈ ప్రక్రియలో విద్యుదాఘాతం జరిగితే ప్రాణానికే ప్రమాదం.

**చర్యలు తీసుకుంటున్నాం సైదా, విద్యుత్ ఏఈ కోదాడ గ్రామీణం**

చెరువులు, వాగులు, కాలువల పక్కనే ఉంటున్న రైతులు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. చేపల వేట కోసం విద్యుత్తు దొంగిలించకుండా హెచ్చరించాల్సిందిగా ఇప్పటికే కోరాం.

# పర్యావరణం బొగ్గు

ఆత్మకూర్ : అటవీ శాఖ అనుమతులు లేకుండా, విలువైన కలపను బట్టీలుగా పేరుస్తూ బొగ్గుగా మారుస్తున్నారు. దీంతో ప్రతి గ్రామంలో వెలిసిన బొగ్గుబట్టీల వల్ల పచ్చని వృక్షాలు బొగ్గు మంటల్లో కలిసిపోతున్నాయి. ఆత్మకూర్(ఎస్) మండల వ్యాప్తంగా వివిధ గ్రామాలలో బొగ్గు బట్టీలు ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్నారు. హరితహారం పేరిట మొక్కలు పెంచుతూ వేగంగా చెట్లను నరికేయడం పరిపాటిగా మారింది. పర్యవేక్షించాల్సిన అటవీశాఖ అధికారులు ప్రతి బట్టీకి నెలవారి మామూళ్లు దండుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. ఒక్కసారి బొగ్గుబస్తాలను లారీకి ఎక్కిస్తే కనీసం రూ.5వేలకు తగ్గకుండా ముడుపులు పట్టిస్తున్నట్లు తెలుస్తుంది. అలా ఆత్మకూర్(ఎస్), మోతె, చివ్వెంల, సూర్యాపేట మండలాల పరిధిలో రోజూ పది లారీల బొగ్గు బట్టీల నుంచి బయటకు తరలుతున్నట్లు అంచనా. ఈ రకంగా పచ్చని చెట్లను నరికేసి బొగ్గు బట్టీలు అక్రమ సంపాదనకు వనరులుగా మారాయి. ఉన్నతాధికారులు స్పందించి బొగ్గుబట్టీల నిర్వహణను అడ్డుకోవాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.

**నిషేధిత కలప ఉపయోగిస్తే చర్యలు**

కిరణ్‌కుమార్, అటవీశాఖ రేంజ్ అధికారి

బట్టీలలో నిషేధిత కలప ఉపయోగిస్తే జరిమానాలు విధిస్తాం. ప్రభుత్వ నిబంధనల మేరకు బొగ్గు బట్టీలకు అనుమతులు మంజూరు చేస్తున్నాం. ముడుపులు తీసుకుంటున్నట్లు నా దృష్టికి వస్తే మా సిబ్బందిపై విచారణ నిర్వహించి చర్యలు తీసుకుంటాం.

# తుది దశకు ఎత్తిపోతల పనులు



గోదావరిఖని : ఉమ్మడి ఖమ్మం జిల్లా మీదుగా గోదావరి సుదూర ప్రాంతం ప్రవహిస్తోంది. పరీవాహక ప్రాంతంలోని ఇసుక నిక్షేపాల సద్వినియోగంపై ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. గత వర్షాకాలం నదిలో కొట్టుకువచ్చిన ఇసుక పరిమాణాన్ని, నాణ్యతను రెవెన్యూ, ఇరిగేషన్, మైనింగ్, భూగర్భజల వనరుల శాఖలు అంచనా వేశాయి. భద్రాద్రి జిల్లాలో మొత్తం 17 ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు చేపట్టవచ్చని ఉన్నతాధికారులకు నివేదించాయి. ఆయా రీచ్‌లను తమకు కేటాయించాలంటూ గిరిజన సంఘాలు దరఖాస్తు చేశాయి. కానీ, రీచ్‌ల మంజూరులో జాప్యం జరుగుతోంది.

**ఏపీ నుంచి అక్రమంగా తరలింపు..**

భద్రాద్రి జిల్లాలో ప్రస్తుతం ఒక్కచోట (చర్ల) మాత్రమే ప్రభుత్వ అనుమతులతో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. మిగతా చోట్ల క్వారీలు ఏర్పాటు చేయకపోవడంతో అక్రమార్కులు గోదావరి నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. డిమాండ్‌ను బట్టి ట్రాక్టర్‌కు రూ.3-రూ.5 వేల వరకు సొమ్ము చేసుకుంటున్నారు. పెద్ద మొత్తంలో ఇసుక అవసరమున్న గుత్తేదారులకు ఏపీ నుంచి అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఏపీలోని నందిగామ నుంచి కృష్ణానది ఇసుకను మధిర, వైరా, తల్లాడ మీదుగా హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు సమాచారం. నిత్యం పదుల లారీల్లో ఇసుక తరలుతోంది. ఇంకోవైపు చూస్తే.. గోదావరిలో ఇసుక నిల్వలు పుష్కలంగా ఉన్నాయి.

**గిరిజన సంఘాల ఆవేదన**

జిల్లా సహకార శాఖ గుర్తింపు గల గిరిజన సంఘాలకు ప్రభుత్వం టీజీఎండీసీ (తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ద్వారా ఇసుక రీచ్‌లను కేటాయిస్తుంది. జిల్లాలో ఇలాంటి సంఘాలు సుమారు 16 ఉన్నాయి. వీటికి ఒక క్యూబిక్ మీటరుకు లోడింగ్ ఖర్చుగా ప్రభుత్వం రూ.140 చెల్లిస్తోంది. గుత్తేదారులు, స్థానిక వినియోగదారులు టీజీఎండీసీకి క్యూబిక్ మీటరుకు రూ.650 చెల్లించాలి. 2022-23లో 10, 2023-24లో 6 గిరిజన సంఘాలకు రీచ్‌లు ఏడాది వ్యవధితో కేటాయించారు. ప్రస్తుతం రీచ్‌లకు అనుమతులివ్వకపోవడంతో సంఘాలు, ప్రభుత్వం ఇరువైపులా ఆదాయం కోల్పోతున్నాయి. గత నాలుగేళ్లలో పరిశీలిస్తే.. 2022-23లో అత్యధికంగా రూ.136 కోట్ల ఆదాయం రాగా, ఈ ఏడాది కేవలం రూ.45 కోట్లు మాత్రమే సమకూరినట్లు గణాంకాలు చెబుతున్నాయి. మార్కెట్ డిమాండ్‌ను బట్టి అమ్మకాలు పెంచితే మునుపటి కంటే అధికాదాయం సమకూరే అవకాశముంది."వివిధ శాఖల అధికారులు జిల్లాలో ఇసుక నిల్వలను గుర్తించి నివేదికలు అందజేశారు. వాటి ఆధారంగా తవ్వకాలకు అనువైన ప్రాంతాలను గుర్తించాం. త్వరలోనే టీజీఎండీసీ ద్వారా ఇసుక రీచ్‌లను గిరిజన సంఘాలకు కేటాయిస్తాం."దినేష్, మైనింగ్ ఏడీ, భద్రాద్రి కొత్తగూడెం

# సింగరేణి బొగ్గు 'ప్రియం'



కొత్తగూడెం : ఇతర పరిశ్రమలతో పోల్చిచూస్తే సింగరేణిలో బొగ్గు వెలికితీతకు అయ్యే ఖర్చు అధికం. ఈ కారణంతో ఉత్పత్తి ధర కూడా ఎక్కువే. వెస్టన్, మహానది కోల్‌ఫీల్డ్స్ సంస్థలతో పోల్చిచూస్తే సింగరేణి బొగ్గు ధర దాదాపు రెండు రెట్లు అధికం. పెరుగుతున్న ప్రైవేటు సంస్థల పోటీ నేపథ్యంలో.. సింగరేణి తన మనుగడ కోసం ఉత్పత్తి వ్యయం తగ్గింపుపై దృష్టిసారించక తప్పని పరిస్థితి నెలకొంది. ఇటీవల మల్టీడిపార్ట్‌మెంట్ సమావేశాల్లో, తాజాగా జరిగిన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలోనూ దిద్దుబాటు చర్యలపై యాజమాన్యం సమాలోచనలు జరిపింది. వచ్చే ఉత్పత్తి సంవత్సరంలోగా మార్పు దిశగా చర్యలు చేపడుతోంది.

**ఉత్పత్తి అధిక వ్యయానికి కారణాలివే..**

దేశంలోని ఇతర కంపెనీల్లో బొగ్గు ఉత్పత్తి వ్యయం సింగరేణికన్నా తక్కువగా ఉంటోంది. దీనికి కారణం.. అక్కడ ఒక టన్ను బొగ్గును వెలికితీసేందుకు నాలుగైదు టన్నుల మట్టిని తొలగిస్తే సరిపోతుంది. కానీ, సింగరేణిలో ఒక టన్నుకు కనీసం ఏడు టన్నులకు పైగా మట్టిని తొలగించాల్సి వస్తోంది. దీంతో వ్యయం అధికమవుతోంది. దీంతోపాటు యంత్రాల వినియోగ సామర్థ్యం తీసికట్టుగా ఉంది. ఒక్కో యంత్రంతో సగటున రోజుకు 18 గంటల పాటు ఉత్పత్తి చేపట్టే వీలుంది. కానీ, కేవలం 7 గంటల 24 నిమిషాలు మాత్రమే వినియోగిస్తున్నారు. ఇతర కంపెనీల్లో ఈ పని గంటలు అధికంగా నమోదవుతున్నాయి. అధిక ధరను భరించైనా సింగరేణి బొగ్గునే పరిశ్రమలు కొనేందుకు ఓ కారణం ఉంది. అదే.. రవాణా వ్యయం. వెస్టన్, మహానది కోల్‌ఫీల్డ్స్ బొగ్గు ధర తక్కువ అయినా, రవాణా ఛార్జీలు కలుపుకొంటే సింగరేణి ఉత్పత్తే కాస్త చౌకగా ఉంటోంది. అందుకే, ఇక్కడి విద్యుత్తు ఉత్పత్తి కంపెనీలు అనివార్యంగా సింగరేణిపై ఆధారపడుతున్నాయి. భవిష్యత్తులో పోటీ ఉన్నందున ఉత్పత్తి వ్యయాన్ని వీలైనంత తగ్గించుకోవాలని సింగరేణి యాజమాన్యం భావిస్తోంది. వరుస సమీక్షలు నిర్వహిస్తోంది.

**చేపట్టాల్సిన చర్యలివీ..**

టన్ను బొగ్గు ఉత్పత్తికి 7 టన్నుల మట్టి తొలగించడం అనివార్యం. దీనికి ప్రత్యామ్నాయం లేదు. యంత్రాలు, మానవ వనరుల పని సామర్థ్యాన్ని పెంచుకోవడమే సింగరేణి ముందున్న ఏకైక మార్గం. ప్రస్తుతం గనుల్లోని షావెళ్ల పనితీరు బాగానే ఉన్నా, మిగతా యంత్రాలపై దృష్టిపెట్టాలి. ఉపరితల గనుల్లో 48 డ్రిల్ యంత్రాలున్నాయి. ప్రస్తుతం వీటిని 5.8 గంటలు మాత్రమే వినియోగిస్తున్నారు. మిగతా సమయంలో వృథాగా ఉండకుండా.. గరిష్ఠంగా రోజుకు 19.4 గంటలు ఉపయోగించేందుకు చర్యలు చేపట్టాలి. అవసరం మేర కొత్త యంత్రాలు కొనుగోలు చేయాలి. తద్వారా అదనంగా బొగ్గు ఉత్పత్తి అవుతుంది."సింగరేణిలో మొత్తంగా 828 యంత్రాలు పనిచేస్తుండగా.. వాటి సగటు వినియోగాన్ని వచ్చే ఉత్పత్తి సంవత్సరం కల్లా కనీసం నాలుగు గంటలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇలాచేస్తే మరో 20 లక్షల క్యూబిక్ మీటర్ల బొగ్గు అదనంగా ఉత్పత్తి అవుతుంది. ఉత్పత్తి వ్యయం కూడా తగ్గి వినియోగదారులకు తక్కువ ధరకు బొగ్గు ఇవ్వగలుగుతాం".ఎన్.బలరాం, సీఎండీ

# 2 కిలోమీటర్లు.. 8 మలుపులు

మంథని : సింగరేణి ఆధ్వర్యంలోని రహదారిపై తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పదేళ్ల క్రితం బిట్టుపల్లి శివారులోని అసైన్డ్ భూమి సేకరించిన సంస్థ రచ్చపల్లి, అక్కెపల్లి, లద్నాపూర్ భూ నిర్వాసితులకు పునరావాసకాలనీ కోసం రూ.2 కోట్లతో ఒక వరుస తారు రోడ్డు నిర్మించింది. మంథని మండలం సూరయ్యపల్లి నుంచి రచ్చపల్లి పునరావాస కాలనీ వరకు 2 కి.మీ మేర రహదారిపై ఎనిమిది చోట్ల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. లోలెవల్ వంతెనలతో రహదారిపై నుంచి నీరు ప్రవహించడంతో గుంతలు ఏర్పడి ప్రయాణికులు అదుపు తప్పుతున్నారు. రోడ్డు మరమ్మతులకు.. విస్తరణకు సింగరేణి శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. 15 రోజుల క్రితం గుంతలు పూడ్చినప్పటికీ అధిక సంఖ్యలో వాహనాలు నడవడంతో పరిస్థితి మొదటికొచ్చింది.

**పెరిగిన వాహనాల రాకపోకలు**

మంథని మండలం బిట్టుపల్లి, ధర్మారం, గోపాల్‌పూర్, చిన్నఓదాల, ముత్తారం మండలం సీతంపల్లి, ఖమ్మంపల్లి, జిల్లాలపల్లి గ్రామస్థులు ఈ మార్గంలోనే ప్రయాణిస్తుంటారు. గతంలో మట్టిదారి ఉండేది. అప్పుడు రోజుకు సుమారు 20 వాహనాలు నడిచేవి. ఏడాది క్రితం ఖమ్మంపల్లి నుంచి భూపాలపల్లి జిల్లా తాడిచెర్ల మధ్య మానేరు వాగుపై వంతెన ప్రారంభించడంతో 1000 వరకు రాకపోకలు సాగిస్తున్నాయి.

**పదేళ్లుగా మరమ్మతు కరవు**



జలగలవంత వాగుపై లోలెవల్ వంతెనతో రహదారిపై నుంచి వర్షాకాలంలో నీరు ప్రవహిస్తోంది. దీంతో గుంతలు ఏర్పడి.. వాహనదారులు అదుపుతప్పుతున్నారు. రచ్చపల్లి వద్ద గత నవంబరు 20న రాత్రి కారు దిచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో గుర్రం మమత, సదయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో ఢీకొన్న కారు వివరాలు తెలియకుండా పోయాయి. వారానికి ఒక రోడ్డు ప్రమాదం జరుగుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. రహదారిని పంచాయతీరాజ్, రోడ్ల భవనాల శాఖకు అప్పగించక పోవడంతో పదేళ్లుగా మరమ్మతులకు నోచుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

**రెండు వరుసల రహదారి నిర్మించాలి**

రహదారి ఇరుకుగా ఉండటంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి రెండు వరుసల రహదారి నిర్మించాలి.వడ్లకొండ రామస్వామి, రచ్చపల్లి

# ఆశలు ఆవిరేనా?

భువనగిరి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రాంతీయ వలయ రహదారి ప్రక్రియ రోజుకో అడుగు పడుతోంది. టెండర్లకు ఆహ్వానం పలకడంతో కీలక ఘట్టం ప్రారంభమైంది. ఉత్తర భాగానికి ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించడంతో.. రాయగిరి, చౌటుప్పల్ ట్రిపుల్ ఆర్ నిర్వాసితుల గుండెల్లో దడ మొదలైంది. అలైన్‌మెంట్ మార్పుకోసం ఉత్తరం భాగంలో సంగారెడ్డి, యాదాద్రి జిల్లా రైతులు పట్టువీడని విక్రమార్కుల్లా పోరాటాలు చేస్తున్నారు. కోర్టును కూడా ఆశ్రయించారు. భాజపాకు చెందిన ఇద్దరు కేంద్ర మంత్రుల సారథ్యంలో రాష్ట్రానికి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు సంతకాలతో అలైన్‌మెంట్ మార్చాలని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్‌గడ్కరిని కలిసి కూడా పలుమార్లు విన్నవించారు. కేంద్ర మంత్రులే హామీ ఇవ్వడంతో మార్పుపై ఆశలు పెట్టుకోగా.. ఈ నేపథ్యంలో ఉత్తర భాగానికి సంబంధించి 161 కి.మీ.లకు 5 బిట్లలో టెండర్లు పిలిచారు. ఇందులో భువనగిరి, చౌటుప్పల్ మండలాలు కూడా ఉన్నాయి. ప్రజ్ఞాపూర్ నుంచి రాయగిరి వరకు 43 కి.మీ., రాయగిరి నుంచి చౌటుప్పల్ మండలం తంగేడుపల్లి వరకు 35 కి.మీ.లు కూడా ఉండటంతో నిర్వాసిత రైతులు ఆగ్రహంతో ఉన్నారు.




**ఇదీ జిల్లాలో ఇలా..**

యాదాద్రి జిల్లాలో తుర్కపల్లి, యాదగిరిగుట్ట, భువనగిరి, వలిగొండ, చౌటుప్పల్ మండలాల మీదుగా మొత్తం 59.33 కిమీ మేర ప్రాంతీయ వలయ రహదారి వెళుతుంది. ఇందుకోసం 235 హెక్టార్ల భూమి సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తుర్కపల్లి, యాదగిరిగుట్ట మండలాలకు సంబంధించిన 47.18 హెక్టార్ల భూసేకరణ ప్రక్రియ పూర్తిగా సాఫీగా ముగిసింది. జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ అధీకృత భూసేకరణ అధికారిగా ఉన్నారు. అవార్డు విచారణ పూర్తయ్యింది. ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు నివేదిక కూడా పంపించారు.

**ఆందోళనలో భూ నిర్వాసితులు**

భువనగిరి, చౌటుప్పల్ మండలాల్లో భూముల ధర మార్కెట్‌లో రూ.కోట్లలో పలుకుతోంది. ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు రెండోసారి అలైన్‌మెంట్ మార్చి నోటిఫికేషన్ ఇచ్చి భూములు సేకరిస్తుండటంతో తాము నష్టపోతున్నామని 27 మంది రైతులు హైకోర్టులో ఏడాదిన్నర కిందట రిట్ వేశారు. హైకోర్టు స్టే ఇచ్చింది. రెండు నెలల కిందట కేసు కొట్టివేయడంతో భూసేకరణ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వం చేపట్టి పూర్తిచేశారు. అవార్డు ఎంక్వైరీకి నోటీస్ ఇచ్చినా భువనగిరి, చౌటుప్పల్ రైతులు ఎవరు హాజరు కాలేదు. మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

**ప్రజాప్రతినిధులపై గుర్రుగా..**

భువనగిరి మండలానికి సంబంధించి అలైన్‌మెంట్ మార్పు చేస్తామని అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ప్రస్తుత ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నిర్వాసితులకు హామీ ఇచ్చారు. పార్టీ అధినేత్రి ప్రియాంక గాంధీతో భువనగిరి ఎన్నికల సభలోనూ హామీ ఇప్పించారు. అధికారంలోకి వచ్చాక వారు తమ సమస్య పట్టించుకోవడంలేదని నిర్వాసితులు గుర్రుగా ఉన్నారు. మోసం చేశారని వాట్సప్ గ్రూప్‌లో వైరల్ చేస్తున్నారు. ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నాకు సిద్ధమవుతున్నారు.

**జిల్లాలో ట్రిపుల్ ఆర్ స్వరూపం**

తుర్కపల్లి: వీరారెడ్డిపల్లి, కోనాపూర్, దత్తాయపల్లి, ఇబ్రహీంపూర్ వేల్పుపల్లి యాదగిరిగుట్ట: మల్లాపూర్, దాతర్‌పల్లి(19.33 కిమీ)

భువనగిరి: రాయగిరి, కేసారం, పెంచికలపహాడ్, తుక్కాపూర్, గౌస్‌నగర్, ఎర్రంబెల్లి(15 కిమీ)

వలిగొండ: పహీల్వాన్‌పూర్, రెడ్లరేపాక, పొద్దుటూరు, వర్కుట్‌పల్లి, గోకారం

చౌటుప్పల్ మండలం: చిన్నకొండూరు, చౌటుప్పల్, తాళ్లసింగారం, లింగోజుగూడెం, నేలపట్ల, తంగేడుపల్లి: 25 కిమీ..

మొత్తం సేకరించే భూమి: 235 హెక్టార్లు

**జనరల్ అవార్డు పాస్ చేస్తాం**

శేఖర్‌రెడ్డి, ఆర్డీవో, చౌటుప్పల్

చౌటుప్పల్ మండలం నిర్వాసితులు ఎవరూ అవార్డు విచారణకు రాలేదు. జనరల్ అవార్డు పాస్ చేసి ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు పంపుతాం. అవార్డు అంగీకరించిన నిర్వాసితులకు పరిహారం డబ్బులను వారి ఖాతాల్లో జమ చేస్తాం. కాన్సెంట్ ఇవ్వని వారి డబ్బులను భూసేకరణ అధికారి ఖాతాలో జమచేస్తాం. వలిగొండ మండలానికి అవార్డు విచారణ చేసి ఎన్‌హెచ్‌ఏఐ రాష్ట్ర విభాగానికి రెండు నెలల కిందటే పంపాం. చౌటుప్పల్ అర్బన్‌లో 145 ఎకరాలకు సంబంధించి అవార్డును రెండు రోజుల్లో పంపిస్తాం.

# గడువులోపు గగనమే..!

సూర్యాపేట : ఇందిరమ్మ ఇళ్ల సర్వే గడువు లోపు పూర్తయ్యే అవకాశాలు కనిపించటం లేదు. ఈ నెల 31 వరకు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇంకా మూడురోజులే సమయం ఉండటంతో పూర్తి అవుతుందా.. గడువు పెంచుతారా తెలియటం లేదు. గతేడాది నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో అబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్నారు. ఇళ్లు లేని వారు తమకు ఇళ్లు తప్పక వస్తుందనే ఆశతో ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేశారు.

**5 పురపాలికలు.. 475 గ్రామాలు** సూర్యాపేట జిల్లాలో ఐదు పురపాలికలు, 475 గ్రామాలు ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా అధికారం చేపట్టిన వెంటనే డిసెంబర్ చివరి వారం నుంచి జనవరి మొదటి వారం వరకు ప్రజాపాలన కార్యక్రమాలు నిర్వహించింది. ఇందులో కొత్త రేషన్‌కార్డులు, జీరో విద్యుత్తు బిల్లులు, ఇళ్లకు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే జీరో విద్యుత్తు బిల్లులు లబ్ధిదారులు పొందుతుండగా, ఇందిరమ్మ ఇళ్లు పంపిణీకి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లకు 3,09,062 మంది దరఖాస్తులు చేసుకోగా వీరిలో అర్హులను గుర్తించేందుకు ప్రభుత్వం సర్వే చేపట్టాలని అధికారులకు సూచించింది. దీంతో జిల్లాలోని పురపాలికలు, గ్రామాల్లో సర్వే చేపడుతున్నారు. ఈ నెల 27 వరకు జిల్లాలో 1,95,106 ఇళ్ల సర్వేను పూర్తి చేశారు. ఇంకా 1,13,956 ఇళ్లు సర్వే చేపట్టాల్సి ఉంది. అందుల్లో 475 గ్రామాల్లో 2,50,685 దరఖాస్తులకు గాను 1,56,132 ఇళ్లకు సర్వే పూర్తయింది. మొత్తం 63శాతం సర్వే పూర్తవగా పురపాలికల్లో 66, గ్రామాల్లో 62శాతం పూర్తయింది. ఈ నెల 31 వరకు పూర్తి చేయాలని అధికారులు లక్ష్యం పెట్టుకోగా ఈ మూడురోజుల్లో పూర్తయ్యేలా కనిపించటం లేదు.




# రైతులకు శుభవార్త చెప్పిన కేంద్రం

న్యూఢిల్లీ, జనవరి 01: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ బుధవారం న్యూఢిల్లీలో సమావేశమైంది. ఈ భేటీలో కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అవన్నీ రైతుల సంక్షేమం కోసమే కేంద్ర కేబినెట్ ఈ నిర్ణయాలు తీసుకుంది. అందుకు సంబంధించిన వివరాలను న్యూఢిల్లీలో విలేకర్ల సమావేశంలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వివరించారు. దేశవ్యాప్తంగా రైతుల కోసం చేపట్టిన.. ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకాన్ని పొడిగించాలని కేబినెట్ తీర్మానం చేసిందని తెలిపారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రూ. 69,515 కోట్లకు పెంచినట్లు వివరించారు. అలాగే ఫండ్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీకి రూ. 800 కోట్ల కేటాయించినట్లు పేర్కొన్నారు. సాంకేతికతను ఉపయోగించి త్వరితగతిన రైతుల పంటలకు పంట బీమా చెల్లింపు విధానానికి ఫండ్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ తోడ్పడనుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ సోదాహరణగా వివరించారు. కొత్త సంవత్సరం ప్రారంభమైన తొలి రోజు భేటీ అయిన.. ఈ తొలి కేబినెట్‌ను రైతులకు అంకితం ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించిందని చెప్పారు. ఇక ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద దేశవ్యాప్తంగా నాలుగు కోట్ల మంది రైతులు లబ్ది పొందుతున్నారని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. అలాగే 50 కిలోల బస్తా డీఏపీ.. రూ.1,350కి రైతులకు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఈ డీఏపీ ఎరువులపై అదనపు భారాన్ని భరించాలని కేంద్రం నిర్ణయించిందని సోదాహరణగా ఆయన వివరించారు. డీఏపీ ఎరువుల సబ్సీడీకి అదనంగా రూ.3,850 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. 2014లో ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టారు. నాటి నుంచి గతేడాది వరకు.. అంటే 2024 చివరి వరకు.. ఎరువుల సబ్సీడీ కింద రూ. 11.9 లక్షల కోట్లను కేంద్రం ఖర్చు చేసింది. అదే విధంగా 2024లో ముచ్చటగా మూడోసారి కేంద్రంలో మోదీ ప్రభుత్వం కొలువు తీరింది. ఆ క్రమంలో రైతుల కోసం రూ. 6 లక్షల కోట్ల విలువైన 23 కీలక నిర్ణయాలను కేంద్రం తీసుకుంది.

# 2024.. చరిత్ర తిరగరాసిన సంవత్సరం: చంద్రబాబు



మంగళగిరి: 2024.. చరిత్ర తిరగరాసిన సంవత్సరమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గత ఐదేళ్లు ప్రజలు పడిన ఇబ్బందులకు విముక్తి కలిగిందని, ఇదే సమయంలో మీడియా కూడా ఇబ్బంది పడిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అందరికీ భవిష్యత్తుపై భరోసా వచ్చిందని పేర్కొన్నారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో చంద్రబాబు ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. కొందరు అధికారులు జగన్ మాటలు విని పనిచేశారని పేర్కొన్నారు. జగన్.. చివరకు అధికారులను కూడా గత ఐదేళ్లు బురద గుంతలో తోసేశారని విమర్శించారు. "ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై మంచి అభిప్రాయం ఉంది. ప్రజల ఆలోచనలు, అవసరాల మేరకు పాలనా విధానాలను మార్చుకుంటున్నాం. అధికారులు కూడా ప్రజల ఆకాంక్షల మేరకు పనితీరు మార్చుకోవాలి. ఎమ్మెల్యేలకు దశలవారీగా కౌన్సిలింగ్ ఇస్తున్నా. తప్పుడు పనులు చేయొద్దని వారిని పదేపదే హెచ్చరిస్తున్నా. సమాజానికి హానికరమైన వారిని మాత్రం వదిలేది లేదు. గతంలో రౌడీయిజం, మతకలహాలను అణచివేసినట్లే ఇప్పుడూ చేస్తాను. కొన్ని అంశాల్లో పార్టీ శ్రేణులు, నా అభిప్రాయాల్లో తేడా ఉంటోంది. కొందరు కార్యకర్తలు తమ అజెండాను నేను అమలు చేయాలని అనుకుంటున్నారు. జగన్ మాదిరిగా మేమూ తప్పులు చేస్తే ఎలా.. ప్రజలన్నీ గమనిస్తూనే ఉంటారు. నాకు నా ప్రజలే హైకమాండ్. తప్పు చేసిన ఏ ఒక్కరినీ వదిలి పెట్టేది లేదు. గత విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు శ్రమిస్తున్నాం.

**అమరావతిలో సినిమాలకు మంచి మార్కెట్..** ప్రస్తుతం సినిమాలకు హైదరాబాద్ హబ్‌గా మారింది. తెదేపా ప్రభుత్వం కల్పించిన అవకాశాల కారణంగానే ఇదంతా సాధ్యమైంది.

సినిమాలకు ఓవర్సీస్ మార్కెట్ బాగా పెరిగింది. అమరావతి నిర్మాణం పూర్తయితే.. సినిమాలన్నీ ఇక ఏపీలోనే నిర్మించేందుకు అవకాశం ఉంటుంది. అమరావతిలో సినిమాలకు మంచి మార్కెట్ ఉంటుంది" అని చంద్రబాబు తెలిపారు.




గుడివాడ: మాజీ మంత్రి కొడాలి నాని ప్రధాన అనుచరుడు, కృష్ణా జిల్లా వైకాపా యువజన విభాగం అధ్యక్షుడు మెరుగుమాల కాళీకి న్యాయస్థానం రిమాండ్ విధించింది. గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం పోలీసులు ఆయన్ను గుడివాడ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చారు. ఈ నెల 10 వరకు కోర్టు ఆయనకు రిమాండ్ విధించింది. ఆ తర్వాత నిందితుడు కాళీని పోలీసులు నెల్లూరు కేంద్ర కారాగారానికి తరలించారు. %వైకాపా అధికారంలో ఉండగా గుడివాడ తెదేపా కార్యాలయం, ఆ పార్టీ నేత రావి వెంకటేశ్వరరావుపై దాడి కేసులో కాళీ కీలక సూత్రధారి. 2022 డిసెంబరు 25న రాత్రి.. కాళీ తన అనుచరులతో కలిసి తెదేపా కార్యాలయం, రావిపై పెట్రోల్ ప్యాకెట్లతో దాడి చేశాడు. ఈ సంఘటనపై రావి వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేసినా నాటి అధికార పార్టీ ప్రోద్బలంతో నిందితులను అరెస్టు చేయలేదు. పైగా రావి వర్గీయులు, ఇతర తెదేపా నాయకులపై ఎదురు కేసులు నమోదు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సంఘటన వీడియోలను పోలీసులు పరిశీలించి హత్యాయత్నం సెక్షన్‌ను జోడించారు. ఈ క్రమంలో డిసెంబరు 4న పది మంది నిందితులను ఏకకాలంలో అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత మరో ముగ్గురిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ముఖ్య నిందితుడైన కాళీ.. అస్సాం రాష్ట్రంలో చేపల వ్యాపారం చేస్తున్నాడని గుర్తించి పక్కా ప్రణాళికతో మంగళవారం అదుపులోకి తీసుకుని గుడివాడకు తీసుకొచ్చారు. నేడు వైద్యపరీక్షల అనంతరం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు.

# అభివృద్ధి వైపు ఏపీ అడుగులు

నెల్లూరు, జనవరి 1: "2024 గడిచిన సంవత్సరానికి వీడ్కోలు పలుకుదాం.. నూతన సంవత్సరానికి స్వాగతం" అని మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా జిల్లాలోని తల్పగిరి రంగనాధుడుని మంత్రి ఆనం దర్శించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రాన్ని పురోగతి వైపు నడిపించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిరంతరం కష్టపడుతున్నారని తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి వైపు అడుగులు పడుతున్నాయన్నారు. వ్యవసాయపరంగా, పారిశ్రామికంగా అభివృద్ధి సాధిద్దామని అన్నారు. యువతకు ఉద్యోగ,



ఉపాధి అవకాశాలు కల్పిస్తామని... స్వయం సమృద్ధి సాధించడానికి కూటమి ప్రభుత్వం ప్రణాళికతో పని చేస్తోందని వెల్లడించారు. ఆర్థికంగా రాష్ట్రం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. యువత నూతన పరిశ్రమలు పెట్టడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. నూతన సంవత్సరంలో పోలవరం పూర్తి చేసుకుంటామని.. జలహారం.. సాగరమాల పూర్తి చేయడానికి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందాలని ప్రజలు పూజలు చేయాలని కోరారు. నెల్లూరు జిల్లాలో కృష్ణపట్నం రామాయపట్నం సోలార్ విద్యుత్ ప్రాజెక్టులు.. రామాయపట్నం పోర్టు వద్ద బీపీసీల్ ప్రాజెక్ట్‌తో అభివృద్ధి చెందబోతుందన్నారు. దగదర్తి ఏయిర్ పోర్టును పూర్తి చేసుకుంటామని మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి పేర్కొన్నారు.

# హొటల్‌కు తీసుకెళ్లి.. తల్లి, నలుగురు చెల్లెళ్లను హత్య చేసి..

కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని అంతా సంతోషంగా గడుపుతున్న వేళ.. ఉత్తర్‌ప్రదేశ్‌లో ఓ ఘోరం వెలుగుచూసింది. ఓ వ్యక్తి తన కుటుంబాన్ని అతి దారుణంగా కడతేర్చాడు. హెటల్‌కు తీసుకెళ్లి తల్లి, చెల్లెళ్లను హత్య చేశాడు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లఖ్‌నవూలోని నాకా ప్రాంతంలో ఒక హెటల్‌లో బుధవారం ఉదయం ఈ ఘటన వెలుగుచూసింది.



"ప్రాథమికంగా లభించిన ఆధారాల ప్రకారం నిందితుడిని 24 ఏళ్ల అర్షద్‌గా గుర్తించాం. ఒక హెటల్ గదిలో అతడు తన తల్లి, 19,18,16,9 ఏళ్ల వయసున్న నలుగురు చెల్లెళ్లను హత్య చేసినట్లు స్థానికుల నుంచి సమాచారం వచ్చింది. ఘటనాస్థలంలోనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నాం" అని సెంట్రల్ లఖ్‌నవూ డీసీపీ వెల్లడించారు. ఆ కుటుంబానిది ఆగ్రా అని, వారు ఆ హెటల్‌కు ఎందుకు వచ్చారనే దానిపై ఆరా తీస్తున్నామని తెలిపారు. కుటుంబంలో నెలకొన్న గొడవల వల్లే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు ప్రాథమికంగా వెల్లడవుతోందని తెలిపారు. మృతుల శరీరాలపై గాయాలున్నట్లు పేర్కొన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నామని తెలిపారు.






మచిలీపట్నం: రేషన్ బియ్యం మాయం కేసులో వైకాపా నేత, మాజీ మంత్రి పేర్ని నాని సతీమణి జయసుధకు పోలీసులు మరోసారి నోటీసులు ఇచ్చారు. కేసు విచారణలో భాగంగా మధ్యాహ్నం 2 గంటలకు ఆర్ పేట పోలీస్‌స్టేషన్‌కు రావాలని పేర్కొన్నారు. ఈ కేసులో జయసుధకు ఇప్పటికే న్యాయస్థానం ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. పోలీసు విచారణకు సహకరించాలని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి నోటీసులు ఇచ్చేందుకు పోలీసులు పేర్ని నాని నివాసానికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో డోర్‌కి నోటీసులు అతికించి వచ్చారు.

**రేషన్ బియ్యం మాయం కేసు.. ముగిసిన పేర్ని జయసుధ విచారణ :** రేషన్ బియ్యం మాయం కేసులో మాజీ మంత్రి పేర్ని నాని సతీమణి జయసుధ విచారణ ముగిసింది. ఆర్.పేట సీఐ ఏసుబాబు.. రెండు గంటలకుపైగా ఆమెను ప్రశ్నించారు. ఈ కేసులో పేర్ని జయసుధ ఏ1గా ఉన్నారు. జయసుధకు ఇప్పటికే ముందస్తు బెయిల్ మంజూరు చేసిన న్యాయస్థానం.. పోలీసుల విచారణకు సహకరించాలని ఆదేశించిన విషయం తెలిసిందే.

ఈ నేపథ్యంలోనే బుధవారం ఆమె బందరు తాలూకా పోలీస్‌స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. అవసరమైతే మరోసారి విచారణకు పిలుస్తామని విచారణ అనంతరం సీఐ తెలిపారు.




# సైబర్ నేరాలకు అడ్డా 'వాట్సప్'.. హెూంశాఖ నివేదిక

ఈ ఇంటర్నెట్ యుగంలో సైబర్ నేరాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. రోజుకో కొత్త పంథాలో నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. భారీ లాభాల పేరుతో ఆశజూపడం లేదా డిజిటల్ అరెస్టుల పేరుతో భయభ్రాంతులకు గురిచేస్తూ డబ్బులు గుంజుతున్నారు.

ఈ మోసాలకు సైబర్ నేరగాళ్లు ఎక్కువగా మెసేజింగ్ ప్లాట్‌ఫాట్ 'వాట్సప్'నే వినియోగిస్తున్నారట..! ఈ మేరకు కేంద్ర హెూంమంత్రిత్వ శాఖ ఓ నివేదికలో వెల్లడించింది. వాట్సప్ వేదికగా స్కామర్లు ఎక్కువగా ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారని హెూంమంత్రిత్వ శాఖ పేర్కొంది. ఆ తర్వాత ఈ జాబితాలో టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ ఉన్నట్లు పేర్కొంది. 2023-24 సైబర్ మోసాల జాబితాను హెూంశాఖ తాజాగా విడుదల చేసింది. 2024 తొలి మూడు నెలల్లో వాట్సప్ వేదికగా జరిగిన మోసాలకు సంబంధించి 43,797 ఫిర్యాదులు వచ్చినట్లు ఆ నివేదికలో వెల్లడించింది. ఇక, టెలిగ్రామ్‌లో మోసాలపై 22,680, ఇన్‌స్టా వేదికగా జరిగే నేరాలపై 19,800 ఫిర్యాదులు వచ్చాయని తెలిపింది.

ఈ నేరాల కోసం గూగుల్ సర్వీసెస్ ప్లాట్‌ఫామ్‌లను మోసగాళ్లు ఉపయోగిస్తున్నట్లు హెూంశాఖ తెలిపింది. కొంతమందిని లక్ష్యంగా చేసుకుని ప్రకటనలు చేసేందుకు గూగుల్ అడ్వర్టైజ్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌ను వినియోగిస్తున్నట్లు తెలిపింది. ఈ తరహా మోసాల కట్టడి కోసం తాము చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంది. డిజిటల్ లెండింగ్ యాప్‌ల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ఆయా సామాజిక మాధ్యమాలతో కలిసి పనిచేస్తున్నట్లు తెలిపింది.




# సోలార్ గ్రేట్‌వాల్.. చైనా మరో అద్భుతానికి శ్రీకారం

చైనా మరో భారీ ప్రాజెక్టును శరవేగంగా ప్రారంభించింది. సోలార్ గ్రేట్‌వాల్‌ను నిర్మించే పనిలో నిమగ్నమైంది. ఇది సుమారు 400 కిలోమీటర్ల పొడవు.. 5 కిలోమీటర్ల వెడల్పుతో దీని నిర్మాణం చేపట్టనున్నారు. ఇక్కడినుంచి సుమారు 100 గిగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకొన్నారు. దీంతో బీజింగ్ విద్యుత్తు అవసరాలను తీర్చనున్నారు. ఇప్పటివరకు దాదాపు 5.4 గిగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయగల సోలార్ ప్యానల్స్‌ను అమర్చినట్లు చైనా వెల్లడించింది. ఇన్నర్ మంగోలియాలోని కబుకీ ఎడారిలో దీని నిర్మాణపనులు వేగంగా జరుగుతున్నాయి. గతంలో నిర్మానుష్య ఎడారి ప్రాంతాన్ని సీ ఆఫ్ డెత్‌గా అభివర్ణించేవారు. తాజాగా దీనిపై నాసా ఎర్త్ అబ్జర్వేటరీ దీనిపై స్పందిస్తూ "ఇటీవల కాలంలో ఈ ప్రాంతంలో ఏర్పాటుచేసిన సోలార్ ప్యానెళ్ల కారణంగా ఫొటోవాల్టిక్ సముద్రంగా ఈ ప్రాంతం మారిపోయింది" అని పేర్కొంది. కబుకీ ఎడారిలో వేడి వాతావరణం, చదునైన భూమి, పారిశ్రామిక ప్రాంతాలు దగ్గరగా ఉండటం వంటి అంశాలు సోలార్ ప్రాజెక్టుకు దానిని అనువుగా చేస్తాయి. నాసాకు చెందిన ల్యాండ్ శాట్ 8, 9 ఉపగ్రహాలు ఇక్కడి పరిస్థితిని చిత్రీకరించాయి. వీటిల్లో డిసెంబర్ 2017-2024 మధ్య వాటిని పోల్చి చూస్తే మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. పరిగెత్తే గుర్రం ఆకారంలో జున్మా సోలార్ పవర్ స్టేషన్‌ను ఇక్కడ నిర్మించింది. ప్రపంచంలోనే అతిపెద్ద సోలార్ ప్యానల్స్ ఇమేజ్‌గా ఇది రికార్డు సృష్టించింది. ఇది ఏటా 200 కోట్ల కిలోవాట్ పర్ అవర్ విద్యుత్తు ఉత్పత్తి చేయగలదు. దాదాపు 4,00,000 మంది ప్రజల అవసరాలను ఇది తీర్చగలదు. ప్రస్తుతం చైనా సోలార్ విద్యుత్తు సంస్థలు మొత్తం కలిపి 3,86,875 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయగలవు. ఇది ప్రపంచం మొత్తం సామర్థ్యంలో సగానికి సమానం. ఆ తర్వాత స్థానంలో అమెరికా 79,364 మెగావాట్లను ఉత్పత్తి చేయగలదు.

# విజయవాడ కనక దుర్గమ్మను దర్శించుకున్న సీఎం చంద్రబాబు


విజయవాడ: ఏపీ సీఎం చంద్రబాబు విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనక దుర్గమ్మను దర్శించుకున్నారు. అంతకు ముందు అర్చకులు, సిబ్బంది ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనానంతరం పండితులు ఆయనకు వేదాశీర్వచనాలిచ్చారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు . నూతన సంవత్సరం సందర్భంగా భారీగా భక్తులు తరలివచ్చి జగన్మాతను దర్శించుకుంటున్నారు. దర్శనానంతరం సీఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. తెలుగు రాష్ట్రాలతో పాటు విదేశాల్లో ఉన్న భారతీయులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. దుర్గమ్మను దర్శించుకోవడం సంతోషంగా ఉందని చెప్పారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించినట్లు వివరించారు. ఈ ఏడాది అన్నింటా శుభం జరుగుతుందని విశ్వసిస్తున్నట్లు పేర్కొన్నారు. అందరికీ ఆదాయం పెరిగి, సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్లు చంద్రబాబు చెప్పారు.



**రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన సీఎం :** సీఎం చంద్రబాబు రాజ్‌భవన్‌లో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వారు పరస్పరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కొత్త ఏడాది ప్రభుత్వ లక్ష్యాలపై గవర్నర్‌తో సీఎం చంద్రబాబు చర్చించారు.

# 50 ఏళ్లకు చేరువైనా బాబోయ్ ఇదేం అందం

పవన్ కళ్యాణ్‌తో దాదాపు పాతికేళ్ల క్రితం 'బద్రి' సినిమాలో నటించి తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ అమీషా పటేల్. తక్కువ సమయంలోనే టాలీవుడ్‌లో మంచి గుర్తింపు దక్కించుకున్నప్పటికీ బాలీవుడ్‌కే ఈ అమ్మడు పరిమితం అయ్యింది. తెలుగులో బద్రి తర్వాత నాని సినిమాలో నటించింది. మహేష్ బాబు హీరోగా నటించిన ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద తీవ్రంగా నిరాశ పరచడం మాత్రమే కాకుండా అమీషా పటేల్ పాత్రపై విమర్శలు వచ్చాయి. ఆ తర్వాత ఎన్టీఆర్‌తో నరసింహుడు సినిమాలో నటించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు మళ్లీ తెలుగులో ఈమె నటించలేదు. బాలీవుడ్‌లో మాత్రం ఈమె జోరు కంటిన్యూ అవుతూనే ఉంది. ఇండస్ట్రీలో అడుగు పెట్టి పాతికేళ్లు కావస్తుండగా, ఈమె వయసు అయిదు పదులకు చేరువ అయ్యింది. సాధారణంగా అయిదు పదుల వయసుకు చేరిన హీరోయిన్స్ పెద్దగా బయట కనిపించరు. కానీ అమీషా పటేల్ మాత్రం ఇప్పటికీ సోషల్ మీడియా ద్వారా రెగ్యులర్‌గా వైరల్ అవుతూనే ఉంది. ఈ వయసులోనూ బికినీ వేసుకోవడం, స్విమ్ సూట్‌లో



కనిపించడం, స్కిన్ షో చేయడం ద్వారా వార్తల్లో నిలుస్తోంది. తాజాగా మరోసారి ఈ అమ్మడి అందాల ఆరబోత ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఈసారి టైట్ షార్ట్ ధరించడంతో పాటు స్పోర్ట్స్ బ్రా ధరించింది. ఈ వయసులోనూ ఇంత ఫిట్‌గా ఉన్న అమీషా పటేల్ చాలా మందిని నోరు వెళ్లబెట్టేలా చేసింది. అమీషా పటేల్ ఈ ఏడాదిలోనూ ఒక సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ముందు ముందు మరిన్ని సినిమాలు ఈ అమ్మడి నుంచి వస్తాయని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. బాక్సాఫీస్ వద్ద భారీ విజయాలను సొంతం చేసుకున్న అమీషా పటేల్ అంటే ఇప్పటికీ హిందీ ప్రేక్షకులకు మాత్రమే కాకుండా సౌత్‌లోనూ మంచి డిమాండ్ ఉంది. తెలుగులోనే కాకుండా తమిళ్‌లో ఈమె సినిమాను చేసింది. ఆ సినిమాకు మంచి స్పందన వచ్చి వరుసగా ఆఫర్లు వచ్చినా హిందీ సినిమా ఇండస్ట్రీకే ఈమె పరిమితం అయ్యింది. ఇప్పటికీ ఈమె కోరుకుంటే ఏడాదికి మూడు నాలుగు సినిమాలు చేసే అవకాశాలు వస్తాయి. తన వయసుకు తగ్గ పాత్రలను పోషించడం ద్వారా ప్రేక్షకులను అలరిస్తూ ఉంది. గత ఏడాది ఈమె నటించిన గదర్ 2 సినిమాకు మంచి స్పందన వచ్చింది. ఆ సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకోవడంతో పాటు పలు ఆఫర్లు తెచ్చి పెట్టింది. కానీ ఈమె మాత్రం ఆచితూచి సినిమాల ఎంపిక చేసుకుంటుంది. ఇండస్ట్రీలో ఈ అమ్మడు చేస్తున్న సినిమాలు తక్కువ అయినా సోషల్ మీడియాలో అందాల ఆరబోత ఫోటోలతో కన్నుల విందు చేస్తుంది. తాజా ఫోటోలు చూస్తూ చాలా మంది ఈమె వయసు 50 ఏళ్లకు దగ్గరకు వచ్చింది అంటే నమ్మడానికి లేదు అంటూ కామెంట్స్ చేస్తున్నారు. మరో పదేళ్లు అయినా అమీషా పటేల్ ఇదే స్థాయి అందంగా కనిపిస్తుందనే అభిప్రాయంను వ్యక్తం చేస్తున్నారు.

# తమన్నా 15 ఏళ్ల ప్రయాణంలో భయంకరమైన రోజులా!

మిల్కీబ్యూటీ తమన్నా సినీ ప్రయాణం గురించి చెప్పాల్సిన పనిలేదు. టాలీవుడ్ , కోలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా ఓ వెలుగు వెలిగిన నటి. రెండు భాషల్లోనూ దాదాపు స్టార్ హీరోలందరితోనూ పనిచేసింది. ఇండస్ట్రీలో 15 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణం ఆమె సొంతం. నటిగా తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ ని క్రియేట్ చేసుకుంది. పాత్రలతో సంబంధం లేకుండా పనిచేసింది. ఐటం భామగానూ సత్తా చాటింది. వెబ్ సిరీస్ ల్లో బోల్డ్ గానూ నటించి సంచలనం సృష్టించింది. ఇలా అంది వచ్చిన ప్రతీ అవకాశం వినియోగించుకుని మార్కెట్ లో మిల్కీబ్యూటీ అంటే ఓ బ్రాండ్ గా మారింది. సాధారణంగా నటికి



ఇన్నేళ్ల కెరీర్ అన్నది అంత సులభం కాదు. ఎంతో ప్రతిభ ఉంటే తప్ప సాధ్యం కాదు. ఆ విషయంలో తమన్నా తాను సైతం అని నిరూపించింది. అయితే ఓ అభిమాని ఆనందం కోసం ఏం చేస్తుంటారు? అని అడగగా తనలో పెయిన్ బయట పెట్టే ప్రయత్నం చేసింది. 15 ఏళ్ల ప్రయాణమైనా ఇప్పటికీ ఇండస్ట్రీ కొత్తగానే ఉంటుందంది. ఆనందం కోసం ఎప్పుడు వెతకలేదంది. ఎందుకంటే? వృత్తిని మించిన ఆనందం ఇంకేముం టుంది. చేసే పనిలో బోరింగ్ ఉంటుంది. అదే పనిలో భయంకరమైన రోజులు కూడా ఉన్నాయంది. అంతే కాదు ఎన్నో అవమానాలు, విమర్శలు కూడా ఎదురయ్యాయి అంది. అలాగని వాటిని గుర్తు చేసుకుని బాధపడలేదు. వృత్తిలో భాగమని ముందుకె ళ్లిపోయినట్లు చెప్పుకొచ్చింది. ప్రేక్షకుల్ని అలరించడం తప్ప మరే విషయాలు మనసులోకి రానివ్వనంది. అయితే విమర్శలు..అవమానాల గురించి అమ్మడు వివరించలేదు. సినిమా ఇండస్ట్రీలో ఎదిగే క్రమంలో విమర్శలు, అవమానాలు సహజం. అమితాబచ్చన్, చిరంజీవి లాంటి స్టార్లు కూడా ఎన్నో విమర్శలు, అవమానాలు ఎదుర్కునే లెజెండ్లుగా మారారు.




# ఆ రెండిటి వల్ల వెంకీకి ప్లస్సే.. ఎందుకంటే..?




సంక్రాంతి సినిమాల పండుగలో భాగంగా 2025 సంథింగ్ స్పెషల్ అనిపించేలా ఇద్దరు సీనియర్ స్టార్స్ తో గ్లోబల్ స్టార్ పోటీ పడుతున్నాడు. సీనియర్ స్టార్స్ అయిన బాలకృష్ణ డాకు మహారాజ్ తో వస్తుండగా విక్టరీ వెంకటేష్ సంక్రాంతికి వస్తున్నాం అన్న టైటిల్ తోనే వస్తున్నాడు. ఈ ఇద్దరికి పోటీగా గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ గేమ్ ఛేంజర్ గా దిగుతున్నాడు. ఈ సినిమాను శంకర్ డైరెక్ట్ చేయడంతో సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి.

ఐతే గేమ్ ఛేంజర్ ఒక మంచి కమర్షియల్ మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ గా రాబోతుంది. ఈ సినిమాలో మెగా ఫ్యాన్స్ కోరుకునే అన్ని అంశాలు ఉన్నాయి. థమన్ మ్యూజిక్, కియరా గ్లామర్ కూడా ప్లస్ అయ్యేలా ఉన్నాయి.

ఇక డాకు మహారాజ్ విషయానికి వస్తే పవర్ బాబీకి పవర్ ఫుల్ మాస్ హీరో దొరికితే ఎలా ఉంటుందో ఈ సినిమాతో చూపిస్తున్నారు. డాకు మహారాజ్ తప్పకుండా ఫ్యాన్స్ కి స్పెషల్ ట్రీట్ ఇవ్వనుంది. ఈ సినిమాలతో పాటు వెంకీ మామ సంక్రాంతికి వస్తున్నాం దిగుతుంది. ఐతే గేమ్ ఛేంజర్, డాకు మహారాజ్ ల కన్నా వెంకీ సినిమాకే ఎక్కువ సక్సెస్ పర్సెంటేజ్ ఉందని చెప్పొచ్చు. అలా ఎందుకు అంటే గేం ఛేంజర్ ఒక ఐ.ఏ.ఎస్, పొలిటికల్ మధ్య సాగే యాక్షన్ డ్రామా.. ఇది వర్క్ అవుట్ అయితే అద్భుతాలు చేస్తుంది. ఏమాత్రం తేడా కొట్టినా రిస్క్ లో పడినట్టే. డాకు మహారాజ్ కూడా బాలయ్య మార్క్ మాస్ సినిమాగా వస్తుంది. ఐతే సినిమా క్లిక్ అయితే పర్వాలేదు కాకపోతే మాత్రం మిస్ ఫైర్ అయినట్టే. ఐతే ఆ రెండు సినిమాలకు అనుకున్నది అనుకున్నట్టుగా జరగాలి.

వెంకటేష్ సినిమాకు అలాంటిది ఏది లేదు. జస్ట్ ఎంటర్టైనర్ మూవీగా రాబోతున్న ఈ సినిమా లో అనీల్ మార్క్ ఫన్ ఉంటుంది. వెంకటేష్ మార్క్ ఎమోషనల్ సీన్స్ ఉంటాయి. ఈ ఇద్దరి కాంబో ఆల్రెడీ హిట్టు కాబట్టి ఈ సినిమాకు కలిసి వచ్చేస్తుందని చెప్పొచ్చు. సంక్రాంతికి వస్తున్న ఆ రెండు సినిమాల్లో ఏ ఒక్కటి డివైడ్ టాక్ లేదా మిస్ ఫైర్ అయినా కచ్చితంగా వెంకటేష్ సినిమాకే బాగా ప్లస్ అవుతుందని చెప్పొచ్చు. మరి వెంకీ మామ ఈ సంక్రాంతికి ఏం చేస్తాడో చూడాలి.

# ముగ్గురిలో కామన్ పాయింట్..ఎవరు పవర్ ఫుల్!




సంక్రాంతికి మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ గేమ్ ఛేంజర్‌తో..గాడ్ ఆఫ్ మాసెస్ బాలకృష్ణ డాకు మహారాజ్ తో, విక్టరీ వెంకటేష్ సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో ప్రేక్షకుల ముందుకొస్తున్న సంగతి తెలిసిందే. మూడు సినిమాలపై భారీ అంచనాలున్నాయి. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలు అంచనాలు అంకంతకు పెంచేస్తున్నాయి. సంక్రాంతికి సరైన పందెం కొట్టే పుంజు ఏది అవుతుంది అన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. సక్సెస్ పై ఎవరి ధీమా వారుకుంది. ఎవరి స్టైల్లో వారు ప్రచారం నిర్వహిస్తున్నారు. మరి ఈ మూడు సినిమాలో కామన్ పాయింట్ ఏదైనా ఉందా అంటే ఉందనే తెలుస్తోంది. గేమ్ ఛేంజర్‌లో రామ్ చరణ్ డ్యూయల్ రోల్ పోషిస్తున్నాడు. అందులో ఒకటి రామ్ నందన్ రోల్ ఎంతో పవర్ ఫుల్ గా ఉంటుంది. అది ఐఏఎస్ అధికారి రోల్. ప్రభుత్వ అధికారి పాత్రల్ని శంకర సినిమాల్లో ఎంత బలంగా ఉంటాయో చెప్పాల్సిన పనిలేదు. ఒకే ఒక్కడు అర్జున్ రోల్ తరహాలో ఉంటుందనే ప్రచారం ఇప్పటికే ఊపందుకుంది. ఈ పాత్ర సినిమాకే హైలైట్ గా నిలస్తుందని శంకర్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇక విక్టరీ వెంకటేష్ సంక్రాంతికి వస్తున్నాం లో మాజీ ఐపీఎస్ అధికారి రోల్ పోషిస్తున్నారు. ఆ పాత్రలో హాస్యాన్ని ఎంత బాగా పండిస్తాడో అంతే సీరియస్ ని అనీల్ రావిపూడి హైలైట్ చేస్తాడు. సరిలేరు నీకెవ్వరులో లో మహేష్ ఆర్మీ రోల్ తరహాలో హైలైట్ చేస్తున్నారని లీకులందుతున్నాయి. అలాగే నటసింహ బాలకృష్ణ డాకు మహారాజులో త్రిపాత్రిభనయం చేస్తున్నారు. ఇంత వరకూ ఎక్కువగా హైలైట్ అయింది డాకు పాత్ర మాత్రమే. కానీ మరో రెండు పాత్రల్లో ఓ పాత్ర ఐపీఎస్ రోల్ అని సమాచారం. ఈ పాత్రని బాబి ఇంకా రివీల్ చేయలేదు. ఆన్ స్క్రీన్ పై ప్రేక్షకుల్ని ఐపీఎస్ రోల్ తో థ్రిల్ చేయాలనే దాచి పెట్టి నట్లు లీకులందుతున్నాయి. బాబి సినిమాల్లో ఇలాంటి సర్ ప్రైజ్ లు ఉంటాయి. సడెన్ గా అలాంటి పవర్ ఫుల్ రోల్ తో ప్రేక్షకుల్లో పూనకాలు తెప్పించడం బాబి స్పెషల్. అందుకే ఆ రోల్ గురించి రివీల్ చేయలేదంటున్నారు. అలా ఈ మూడు సినిమాల్లో ప్రభుత్వ అధికారి పాత్రలు ఆ సినిమాలకు హైలైట్ గా ఉంటాయని తెలుస్తోంది.

# సప్త సాగారాల బ్యూటీ ఈ షాక్ ఊహించలేదా..?

టాలీవుడ్ లో కన్నడ భామలకు సెపరేట్ క్రేజ్ ఉంటుంది. అక్కడ నుంచి ఇక్కడికి వచ్చిన ప్రతి హీరోయిన్ స్టార్ అవ్వకపోవచ్చు కానీ కన్నడ భామలకు తెలుగు పరిశ్రమలో మాత్రం మంచి ప్రియారిటీ ఉంటుంది. ప్రస్తుతం పాన్ ఇండియా లెవెల్ లో సంచలనాలు సృష్టిస్తున్న రష్మిక మందన్న కూడా కన్నడ నుంచి టాలీవుడ్ కి వచ్చి ఇక్కడ స్టార్ ఇమేజ్ సాధించిన తర్వాతే బాలీవుడ్ ఆఫర్లు రాబట్టుకుంటుంది. రష్మిక బాటలోనే చాలామంది కన్నడ నుంచి తెలుగు పరిశ్రమకు వస్తున్నారు. ఐతే వారిలో ఆడియన్స్ దృష్టిలో పడిన వారు మాత్రం కొందరు మాత్రమే. కన్నడలో సప్త సాగరాలు దాటితో యువత మనసులు దోచేసింది రుక్మిణి వసంత్. అమ్మడు ఆ సినిమాలో ప్రియ పాత్రలో చేసి యూత్ ఆడియన్స్ అందరికీ ప్రేమికురాలిగా మనసులు దోచేసింది. తెలుగులో సప్త సాగరాలు దాటి సినిమా ఆమె కోసమే చూశారంటే నమ్మాలి. ఐతే అలాంటి రుక్మిణి తెలుగు ఎంట్రీ చాలా గ్రాండ్ గా ఉ



ంటుందని అనుకున్నారు. ఎన్టీఆర్ ప్రశాంత్ నీల్ సినిమాలో ఆమె పేరు బాగా వినిపించింది. తారక్ సినిమాతో ఎంట్రీ అని అందరు అనుకున్నారు. కానీ రుక్మిణి సైలెంట్ గా నిఖిల్ సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. అది కూడా ఆ సినిమా ఎప్పుడు తీశారో కూడా తెలియని విధంగా సినిమా చేశారు. నిఖిల్ సుధీర్ వర్మ డైరెక్షన్ లో తెరకెక్కిన అప్పుడో ఇప్పుడో ఎప్పుడో సినిమాలో రుక్మిణి వసంత్ నటించింది. ఈ సినిమా ఎప్పుడు వచ్చిందో ఎప్పుడు వెళ్లిందో కూడా తెలియదు. ప్రమోషన్స్ కూడా నామ మాత్రంగానే చేశారు. ఐతే తెలుగు ఆడియన్స్ తనపై చూపిస్తున్న అభిమానంతో నిఖిల్ సినిమా చేయగా అది కాస్త అమ్మడికి షాక్ ఇచ్చింది. ఐతే రుక్మిణి లాంటి హీరోయిన్ తెలుగులో ప్రేమకథలు తీయాలని ప్రేక్షకులు కోరుతున్నారు.

సప్త సాగరాలు దాటి తరహాలో ఒక మంచి ఫీల్ గుడ్ లవ్ స్టోరీతో వస్తే మాత్రం తెలుగులో రుక్మిణి క్లిక్ అయ్యే ఛాన్సులు ఉన్నాయి. ఐతే తెలుగులో నెక్స్ట్ ఆఫర్ ఇంకా కన్ఫర్మ్ అవ్వలేదు కానీ అమ్మడు తమిళ్ లో మాత్రం శివ కార్తికేయన్ తో జత కడుతుంది. తమిళ్ లో స్టార్ క్రేజ్ తెచ్చుకుంటే మాత్రం మరో ఐదారేళ్ల దాకా టాలీవుడ్ లో సినిమాలు చేసే అవకాశం లేదని చెప్పొచ్చు.

# బ్రాండ్స్ పరిచయంలో గేమ్ ఛేంజర్ ఈ కపూర్ గాళ్

జోయా అక్తర్ తెరకెక్కించిన 'ది ఆర్చీస్' వెబ్ సిరీస్ తో ఓటీటీకి పరిచయం అయింది ఖుషి కపూర్. తొలి ప్రయత్నానికి మిశ్రమ స్పందనలు వ్యక్తమయ్యాయి. డెబ్యూ నటి ఖుషి పరిణతి చెందిన ప్రదర్శనలు ఇవ్వడానికి ఇంకా అనుభవం అవసరం అని విశ్లేషించారు. ప్రస్తుతం ఈ భామ అమీర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ సరసన అవకాశం అందుకుంది. పెద్ద తెరపై తొలి అవకాశమిది. తాజా సమాచారం మేరకు జునైద్ ఖాన్ – ఖుషీ కపూర్ ప్రధాన పాత్రల్లో నటించిన రొమాంటిక్ డ్రామా 'లవేయాపా' విడుదలకు సిద్ధంగా ఉంది. అద్వైత్ చందన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. లవేయాపా చిత్రం ప్రముఖ బాలీవుడ్ కుటుంబాల నుండి వచ్చిన ఇద్దరు కొత్త తారలను ఒకచోట చేర్చింది. ఈ చిత్రం 7 ఫిబ్రవరి 2025న విడుదల కానుంది. తన మొదటి సినిమా విడుదలకు ముందే ఖుషి సోషల్ మీడియాల్లో భారీగా పాపులారిటీ దక్కించుకుంది. ఈ బ్యూటీ వరుస ఫోటోషూట్లు ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతున్నాయి. ఖుషీ కపూర్




ఇండస్ట్రీలో యూనిక్ ఫ్యాషన్ సెన్స్ ఉన్న బ్యూటీగా పేరు తెచ్చుకుంటోంది. ఖరీదైన బ్రాండెడ్ దుస్తులు, ఆభరణాలను ఈ నటవారసురాలు పరిచయం చేస్తుంది. అలాగే తాను ఎంచుకునే ఒక్కో డ్రెస్ ఖరీదు లక్షల్లో ఉంది. అరచేతిలో ఇమిడిపోయే మినీ హ్యాండ్ బ్యాగుల కోసం కూడా లక్షల్లో ఖర్చు చేస్తోంది. ఇటీవల కొన్ని వరుస ఫోటోషూట్లలో అత్యంత ఖరీదైన బ్రాండెడ్ దుస్తులు, ఆభరణాలను ధరించి కనిపించింది. దుస్తులు, యాక్ససరీస్, మేకప్ మెటీరియల్ అన్నిటా ఖుషీ సాటి స్టార్లకు కాంపిటీటర్ గా మారింది. తాజాగా కరోలినా హెర్రెరా రెడ్ స్టిచ్డ్ లేస్ ఎంబ్రాయిడరీ ఆర్గాంజా గౌన్ ని ధరించి ఖుషి మెరిసిపోయింది. ఈ డిజైనర్ గౌన్ ధర సుమారు రూ.44000/- గా ఉంది. అతిలోక సుందరి శ్రీదేవి నటవారసురాలిగా ఖుషీ కపూర్ పై ఇండస్ట్రీ ఫోకస్ ఉంది. దానికి తగ్గ రేంజులోనే ఖుషికి యూత్‌లో ఫాలోయింగ్ ఏర్పడింది. ఇంకా డెబ్యూ నటి అయినా ఖుషి లక్షల్లో ఆదాయం ఆర్జిస్తోంది. ఇన్ స్టా, సోషల్ మీడియాల్లో యాడ్ పోస్టింగులు, మోడలింగుతోను సంపాదిస్తోంది. తండ్రి బోనీకపూర్, సోదరి జాన్వీ కపూర్ లతో కలిసి ఈ భామ రియల్ వెంచర్లలోను పెట్టుబడులు పెడుతోందని ఇటీవల బాలీవుడ్ మీడియాలో కథనాలొచ్చాయి. ప్రస్తుతం కెరీర్ పైనా ఫోకస్సివ్ గా ఉంది. వరుసగా కథలు వింటోంది.. నచ్చిన స్క్రిప్టులకు కమిటవుతోందని సమాచారం. అయితే అధికారికంగా కొన్నిటిని కొత్త సంవత్సరంలో ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది.




హైదరాబాద్: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. "నవ వసంతంలో విశ్వవేదికపై విజయ గీతికగా తెలంగాణ స్థానం, ప్రస్థానం ఉండాలి. ప్రతి ఒక్కరి జీవితంలో ఈ నూతన సంవత్సరం శుభ సంతోషాలను నింపాలని మనసారా కోరుకుంటున్నా. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు" అని రేవంత్‌రెడ్డి తెలిపారు.





హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం నగర వాసులకు తీపి కబురు చెప్పింది. హైదరాబాద్ ఉత్తర భాగం నగరవాసుల మెట్రో రైల్ కల నెరవేరబోతోంది. హైదరాబాద్ నార్త్ సిటీ వాసులకు నూతన సంవత్సర కానుకగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి .. ప్యారడైజ్– మేడ్చల్ (23 కిలోమీటర్లు), జేబీఎస్–శామీర్‌పేట్ (22 కిలోమీటర్లు) మెట్రో కారిడార్ల డీపీఆర్‌ల తయారీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వెంటనే డీపీఆర్‌లను సిద్ధం చేసి మెట్రో రైల్ ఫేజ్–2 'బి'లో భాగంగా కేంద్ర ప్రభుత్వ అనుమతికి పంపించాలని హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డిని ఆదేశించారు. పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డితో ఈ రెండు కారిడార్ల డీపీఆర్ తయారీ విషయంపై చర్చించి ఈ మేరకు సీఎం కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్యారడైజ్ మెట్రో స్టేషన్ నుంచి తాడ్‌బండ్, బోయిన్‌పల్లి, సుచిత్ర సర్కిల్, కొంపల్లి, గుండ్లపోచంపల్లి, కండ్లకోయ, ఆర్ఆర్ఆర్ ఎగ్జిట్ మీదుగా మేడ్చల్ వరకు దాదాపు 23 కిలోమీటర్ల కారిడార్ ఉంటుంది. జేబీఎస్ మెట్రో స్టేషన్ నుంచి విక్రమ్‌పురి, కారా?నా, తిరుమలగిరి, లోతుకుంట, ఆల్వాల్, బొల్లారం, హకీంపేట్, తూముకుంట, ఓఆర్ఆర్ ఎగ్జిట్ మీదుగా శామీర్‌పేట్‌కు 22 కిలోమీటర్ల మేర ఈ కారిడార్ విస్తరించి ఉంటుందని మెట్రో ఎండీ.. సీఎంకు వివరించారు. మల్కాజిగిరి ఎంపీగా ఉన్నప్పుడు ఈ ప్రాంతం ట్రాఫిక్ సమస్యలపై, ఈ కారిడార్ల రూట్ మ్యాప్‌లపై తనకు మంచి అవగాహన ఉందని సీఎం ప్రస్తావించారు. రూట్ మ్యాప్ విషయంలో ప్రస్తుత మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు కూడా వివరించి ఆయన సూచనలు, సలహాలు తీసుకోవాలని మెట్రో ఎండీని సీఎం ఆదేశించారు. డీపీఆర్ తయారీని 3 నెలల్లో పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తీసుకోవాలని సీఎం సూచించినట్టు మెట్రో ఎండీ తెలిపారు. మెట్రో ఫేజ్–2 'ఏ' భాగం మాదిరిగానే 'బి' భాగాన్ని కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్ ప్రాజెక్టుగా రూపొందించాలని సీఎం ఆదేశించినట్టు చెప్పారు. ఈ ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం అనుమతి కోసం పంపించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని.. ఈ మేరకు వెంటనే డీపీఆర్, ఇతర అనుబంధ డాక్యుమెంట్ల తయారీ చేపడుతున్నట్టు మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వివరించారు.




## ఫార్ములా ఈ రేస్ కేసుపై కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్ : ఫార్ములా ఈ రేసు కేసుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. బుధవారం మీడియాతో కేటీఆర్ మాట్లాడుతూ.. ఫార్ములా ఈరేస్ కేసులో తెలంగాణ హైకోర్టులో ఏ తీర్పు వస్తుందో చూద్దామన్నారు. ఇందులో అవినీతే లేనప్పుడు.. కేసు ఎక్కడది అని ప్రశ్నించారు. ఏసీబీ ఎఫ్ఐఆర్ తప్పు అని వ్యాఖ్యలు చేశారు. ఈకేసులో ఈడీ ఎదుట ఈనెల 7న హాజరుపై తన లాయర్లు నిర్ణయిస్తారని తెలిపారు. ఏసీబీ కేసులో అస్సలు పస లేదని.. తనకు న్యాయస్థానాలపై నమ్మకం ఉందన్నారు. ఫార్ములా ఈ కేసు లొట్టపీసు కేసు అంటూ వ్యాఖ్యలు చేశారు. "పాపం.. నన్ను ఏదో రకంగా జైలుకు పంపాలని ప్రభుత్వం చూస్తోంది. నాపై ఇది ఆరో ప్రయత్నం.. రేవంత్‌కు ఏమీ దొరకటం లేదు" అంటూ సెటైర్ విసిరారు. రూ. 600 కోట్ల సంగతి అటుంచితే.. ఒక్క పైసా కూడా అవినీతి లేదన్నారు. జడ్జి అడిగే ప్రశ్నలకు ఏజీ దగ్గర సమాధానం లేదన్నారు. రేసు కావాలని తాను నిర్ణయం తీసుకున్నాని.. వద్దనేది రేవంత్ నిర్ణయమన్నారు. ఇద్దరి నిర్ణయాలపై క్యాబినెట్‌లో చర్చ జరగలేదన్నారు. " నాపై కేసు పెడితే.. రేవంత్‌పై కూడా కేసు పెట్టాలి. రేవంత్ రెడ్డి.. ఒక ముఖ్యమంత్రినా?" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు కేటీఆర్. నాకే వింత వింత అనుభవాలు ఎదురయ్యాయి..

**కేటీఆర్ పిలుపు..** కేసీఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేయటానికి బీఆర్ఎస్ కార్యకర్తలు పని చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. కొత్త సంవత్సరంలో బీఆర్ఎస్ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. బీఆర్ఎస్‌కు ఎదురయ్యే చిన్న, చిన్న అడ్డంకులను అధిగమించి లక్ష్యాన్ని సాధించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రం, దేశ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కేటీఆర్ అన్నారు. కాగా.. ఫార్ములా ఈరేస్ కేసుకు సంబంధించి కేటీఆర్ వేసిన క్వాష్ పిటిషన్‌పై తీర్పును హైకోర్టు రిజర్వ్ చేసిన విషయం తెలిసిందే. ఆ తీర్పు వెలువడే వరకు కేటీఆర్‌ను అరెస్ట్ చేయవద్దని హైకోర్టు స్పష్టం చేసింది. ఫార్ములా ఈ రేసు కేసుకు సంబంధించి ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ మాజీ మంత్రి కేటీఆర్.. హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. నిన్న (డిసెంబర్ 31) విచారణ జరిపిన హైకోర్టు.. తీర్పును రిజర్వ్ చేసింది. మరోవైపు ఈకేసు సంబంధించి హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి రేపు (జనవరి 2) ఈడీ ముందుకు విచారణకు హాజరుకానున్నారు. అలాగే జనవరి 3 ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ హాజరవుతారు. వీరిద్దరి విచారణ మీద ఈనెల 7 కేటీఆర్ ఈడీ విచారణకు హాజరుకావాలా వద్దే అనేదానిపై నిర్ణయానికి వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.





నూతన సంవత్సరం సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లోని పలు ఆలయాలకు భక్తులు బారుల తీరారు. ఏడాదంతా సుఖ సంతోషాలతో ఉండాలని ప్రత్యేక పూజలు చేశారు.

## షరతుల పేరిట రైతుల నోట్లో మట్టికొట్టే ప్రయత్నం చేస్తున్నారు: హరీశ్‌రావు



సంగారెడ్డి: షరతుల పేరిట రైతుల నోట్లో మట్టికొట్టే ప్రయత్నం చేస్తున్నారని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. బుధవారం సంగారెడ్డిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "పత్తి, చెరకు, పసుపు పంటలకు ఒకసారి మాత్రమే రైతు భరోసా ఇస్తామంటున్నారు. కొండలు, గుట్టలు సాగు చేసే వారికి రైతు భరోసా రాదని చెబుతున్నారు. ఇప్పుడు రైతు భరోసాకు కూడా షరతులు పెడుతున్నారు. రైతు భరోసా కోసం రైతుల నుంచి సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకుంటారంట. బడా కంపెనీలు, కార్పొరేట్ వ్యాపారులకు మాత్రం ఎలాంటి షరతులు ఉండవు. రైతులను దోషిగా నిలబెట్టే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారు? రైతులను మళ్లీ కార్యాలయాల చుట్టూ తిప్పే ప్రయత్నం చేస్తున్నారు. ఏ దరఖాస్తు లేకుండా భారాస ప్రభుత్వం రైతుబంధు ఇచ్చింది. కాంగ్రెస్ నాయకుల చుట్టూ రైతులు తిరగాలని ఈ ప్రభుత్వం చూస్తోంది. వరంగల్ డిక్లరేషన్‌లో చెప్పినట్టు ఎకరానికి రూ.15వేల చొప్పున ఇవ్వాలి. వానాకాలం, యాసంగి పంటలకు కలిపి ఒకేసారి రూ.15వేల చొప్పున ఇవ్వాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## జనాలపైకి దూసుకెళ్లిన వాహనం.. 10 మంది మృతి!



నూతన సంవత్సరం వేళ అమెరికాలో తీవ్ర విషాద ఘటన చోటుచేసుకుంది. జనాలపైకి ఓ వాహనం దూసుకెళ్లిన ఘటనలో 10 మంది మృతి చెందారు. మరో 30 మందికి గాయాలైనట్లు సమాచారం. వేగంగా ఓ వాహనం దూసుకొచ్చిందని, అనంతరం డ్రైవర్ బయటకు వచ్చి జనాలపై కాల్పులు జరిపినట్లు తెలుస్తోందని స్థానిక మీడియా వెల్లడించింది. లూసియానాలోని న్యూ ఆర్లీన్స్‌లో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. న్యూ ఆర్లీన్స్‌లో ఉన్న కెనాల్ అండ్ బోర్బన్ స్ట్రీట్ కూడలిలో నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. దీంతో అక్కడ భారీ సంఖ్యలో జనాలు గుమికూడారు. అదే సమయంలో వేగంగా ఓ వాహనం అక్కడున్న వారిపైకి దూసుకొచ్చింది. అందులో నుంచి బయటకు వచ్చిన డ్రైవర్.. సమూహంపై కాల్పులు జరిపాడు. అప్పటికే పలువురు మృతి చెందగా దాదాపు 30 మంది గాయపడ్డారు. వెంటనే స్పందించిన పోలీసులు డ్రైవర్‌పై కాల్పులు జరిపినట్లు సమాచారం.

## మార్నింగ్ వాక్‌కు వెళ్లిన మంత్రిని ఢీకొట్టిన టెంపో



బిహార్ ఎక్సైజ్ శాఖ మంత్రి రత్నేశ్ సదా రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. మార్నింగ్ వాక్‌కు వెళ్లిన ఆయనను టెంపో ఢీకొట్టింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మంత్రి రత్నేశ్ సదా నూతన సంవత్సర వేడుకల కోసం తన గ్రామానికి వెళ్లారు. తెల్లవారుజామున మంత్రి, ఆయన సోదరుడు, భద్రతా సిబ్బందితో కలిసి మార్నింగ్ వాక్‌కు వెళ్లారు. ఆ సమయంలో వారిని ఓ టెంపో ఢీకొట్టింది. దీంతో ముగ్గురికి గాయాలయ్యాయి. వెంటనే వారిని సదర్ ఆసుపత్రికి తరలించగా, వారికి ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. చికిత్స అనంతరం మంత్రి ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. అతివేగమే ప్రమాదానికి కారణమని అధికారులు తెలిపారు. ఈ ఘటనకు ముందు ఆ టెంపో మరో ఇద్దరిని ఢీకొట్టినట్లు సమాచారం. ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉన్నాడు.

## నూతన సంవత్సర వేడుకలు.. హైదరాబాద్‌లో భారీగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

హైదరాబాద్: నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో మంగళవారం భారీగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 1,184 కేసులు నమోదయ్యాయి. రాచకొండ కమిషనరేట్ పరిధిలో 619 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు తగిన చర్యలు చేపట్టారు. ఆకతాయిలు, మందుబాబులపై దృష్టి సారించారు.





## మాదాపూర్‌లోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో అగ్ని ప్రమాదం



హైదరాబాద్: మాదాపూర్ అయ్యప్ప సొసైటీలోని ఓ వాణిజ్య సముదాయంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. భవనం ఐదో అంతస్తులోని నిపున్ ఐటీ సొల్యూషన్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో మంటలు చెలరేగాయి. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని రెండు ఫైరింజన్లతో మంటలు ఆర్పివేశారు. అగ్ని ప్రమాదంలో కార్యాలయంలోని సామగ్రి, ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిబూడిదయ్యాయి. వాణిజ్య సముదాయంలో మంటలు చెలరేగడంతో మిగిలిన కార్యాలయాల్లోని సిబ్బంది ఒక్కసారిగా బయటకు పరుగులు తీశారు.

## ఎనిమిది మంది పాక్ జాతీయులకు ముంబయి కోర్టు 20ఏళ్ల జైలు శిక్ష

ముంబయి: డ్రగ్స్ కేసులో ముంబయి కోర్టు ఎనిమిది మంది పాకిస్థాన్ పౌరులకు జైలు శిక్ష విధించింది. 2015లో దాదాపు రూ.7కోట్ల విలువైన 200 కిలోల డ్రగ్స్ కేసులో ఒక్కొక్కరికి 20 ఏళ్ల పాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. మాదక ద్రవ్యాల నిరోధక చట్టం కింద ఎనిమిది మందిని దోషులుగా నిర్ధారించిన ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి వారికి శిక్షలు ఖరారు చేశారు. గరిష్ఠంగా 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.2లక్షల చొప్పున జరిమానా విధించారు. 2015లో గుజరాత్ తీరంలో హెరాయిన్‌ను తరలిస్తున్న బోటును భారత కోస్ట్‌గార్డు అధికారులు పట్టుకున్నారు. ఆ బోటులో 11 డ్రమ్ములు, గోధుమ వర్ణంలోని పొడితో కూడిన 20 ప్లాస్టిక్ పౌచ్‌లను గుర్తించారు. ఆ ప్యాకెట్లలోని పదార్థాన్ని గుర్తించగా.. హెరాయిన్ అని తేలింది. ఎనిమిది మంది పాకిస్థాన్ జాతీయులతో పాటు మూడు శాటిలైట్ ఫోన్‌లు, జీపీఎస్ నావిగేషన్ చార్ట్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను సీజ్ చేశారు. అనంతరం నిందితులను దక్షిణ ముంబయి పోలీసులకు అప్పగించారు. అయితే, ఈ కేసులో నిందితులకు గరిష్ఠంగా శిక్ష విధించాలని, మాదకద్రవ్యాల అక్రమ రవాణా చేసేవారికి ఈ తీర్పు హెచ్చరికగా ఉండేలా చూడాలని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుమేశ్ పుంజ్వానీ కోర్టును అభ్యర్థించారు. ఇరు పక్షాల వాదనలు విన్న జడ్జి.. ఈ కేసులో దోషులకు శిక్షలు ఖరారు చేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com